విలేకరులు కావలెను

రెండు తెలుగు రాష్ట్రాల నుండి విడుదలవుతున్న సంచలన సమాచార తెలుగు దినపత్రిక 'సంక్షేమ సాక్షి' లో విలేకరులుగా పనిచేయుటకు అని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాల నుండి బ్యూరో, స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి

సెల్ : 9951813334

E.mail : sankshemasakshi@mail.com

సంక్షేమ సాక్షి

తెలుగు దిన పత్రిక

Printed and Published From : Kurnool | చీఫ్ ఎడిటర్ : కె.రాజేశ్వరి | ఆదివారం 01 నవంబర్, 2026 | సంపుటి : 4 / సంచిక : 43 / పేజీలు : 8 / వెల : రూ.2/-




తుపాను వేళ విద్యుత్..

సిబ్బంది పోరాటం..!!

- ప్రశంసించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్
- మోకాళ్ల లోతు బురద.. ప్రమాదకరమైన చేపల చెరువులు.. చుట్టూ ముంచెత్తిన వరద
- అర్నబ్ తుపాను మిగిల్చిన చీకట్లను తరిమికొట్టేందుకు.. విద్యుత్ సిబ్బంది చేస్తున్న పోరాటం
- ప్రమాదం పొంచి ఉన్న చోట.. ప్రాణాలను సైతం అరచేతిలో పెట్టుకుని...
- ఆ నీటిలోనే గంటల తరబడి నిలబడి 11 కేవీ విద్యుత్ లైన్లను పునరుద్ధరిస్తున్నారు
- ఇది కేవలం డ్యూటీ మాత్రమే కాదు. అక్షరాలా ప్రజాసేవలో ప్రాణాలర్పించే అంకితభావం
- పునరుద్ధరణ పనులు పూర్తయ్యేంత వరకు ప్రజలంతా సంయమనం పాటించాలి..

అమరావతి: అర్నబ్ తుపాను కారణంగా దెబ్బతిన్న విద్యుత్ లైన్లను బాగుచేసేందుకు సంబంధితశాఖ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. "మోకాళ్ల లోతు బురద.. ప్రమాదకరమైన చేపల చెరువులు.. చుట్టూ ముంచెత్తిన వరద. అర్నబ్ తుపాను మిగిల్చిన చీకట్లను తరిమికొట్టేందుకు.. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం డివిజన్ పాలకొల్లు సెక్షన్ పరిధిలోని ఆదర్శపాలెంలో విద్యుత్ సిబ్బంది చేస్తున్న పోరాటం మాటలకు అందనిది. ఒక్క అడుగు తడబడినా ప్రమాదం పొంచి ఉన్న చోట.. ప్రాణాలను సైతం అరచేతిలో పెట్టుకుని, ఆ నీటిలోనే గంటల తరబడి నిలబడి 11 కేవీ విద్యుత్ లైన్లను పునరుద్ధరిస్తున్నారు. తమ బిడ్డలు, కుటుంబాలను ఇళ్ల వద్ద వదిలేసి.. ప్రజల ఇళ్లలో మళ్లీ వెలుగులు నింపాలన్న ఒకే ఒక్క తపనతో, ఎముకలు కొరికే చలిని, ఒళ్లంతా అంటుకున్న బురదను లెక్కచేయకుండా అహర్నిశలు చెమటోడ్చుతున్నారు. ఇది కేవలం డ్యూటీ మాత్రమే కాదు. అక్షరాలా ప్రజాసేవలో ప్రాణాలర్పించే అంకితభావం. క్షేత్రస్థాయిలో ఈ కష్టకాలంలో నిలబడి పోరాడుతున్న ప్రతి విద్యుత్ కార్మికుడికి, అధికారిక బృందానికి చేతులెత్తి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. పునరుద్ధరణ పనులు పూర్తయ్యేంత వరకు ప్రజలంతా సంయమనం పాటిస్తూ, వారికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నాను" అని గొట్టిపాటి పేర్కొన్నారు.



భారీ వర్షాల హెచ్చరిక...

- రాబోయే 6 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం
- రేపు (ఆదివారం) సాయంత్రానికి తుఫాన్‌గా మారే ఛాన్స్
- కొన్నిచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది
- తీరం వెంబడి 45-65 కిమీ వేగంతో గాలులు వీచే అవకాశం
- లోతట్టు ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచన
- రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్

..2వ పేజీలో

అమరావతి : ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న అండమాన్ సముద్ర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని ఏపీఎస్‌డీఎమ్ఏ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రాబోయే 6 గంటల్లో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందన్నారు. ఇది మరింత బలపడి రేపు (ఆదివారం) సాయంత్రానికి తుఫాన్‌గా మారే ఛాన్స్ ఉన్నట్లు వెల్లడించారు. సోమవారం (నవంబర్ 2) సాయంత్రానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతం ఆంధ్రప్రదేశ్ తీరం సమీపంలోని చేరుకునే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో సోమ, మంగళవారాల్లో సెంట్రల్ ఆంధ్రా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురవనున్నట్లు ప్రఖర్ జైన్ తెలిపారు. కొన్నిచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా తీరం వెంబడి 45-65 కిమీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నట్లు చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని..

సమస్యాత్మక ప్రాంతాల్లో బందోబస్తు...

పెంచాం..!!

- ప్రతి జిల్లాలో శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం
- ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా చూస్తున్నాం
- రాష్ట్ర వ్యాప్తంగా 13 కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీల్లో ఆదివారం పోలింగ్ జరగనుంది
- వివిధ నగరపాలికల్లో 118 మంది కార్పొరేటర్లు ఏకగ్రీవం
- మున్సిపాలిటీల్లో 756 మంది కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు
- పోలింగ్ కోసం 13,504 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లను విధుల్లోకి తీసుకున్నాం
- హింసాత్మక ఘటనలు జరిగిన చోట అదనపు బలగాలు తరలించాం
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా



విజయవాడ: ప్రతి జిల్లాలో శాంతి భద్రతలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం, సమస్యాత్మక ప్రాంతాల్లో బందోబస్తు పెంచామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై ఆయన మీడియాతో మాట్లాడారు. "ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా చూస్తున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 13 కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీల్లో ఆదివారం పోలింగ్ జరగనుంది. వివిధ నగరపాలికల్లో 118 మంది కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మున్సిపాలిటీల్లో 756 మంది కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పోలింగ్ కోసం 13,504 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లను విధుల్లోకి తీసుకున్నాం. నామినేషన్ల సమయంలో హింసాత్మక ఘటనలు జరిగిన చోట అదనపు బలగాలు తరలించాం" అని తెలిపారు.

స్కూల్‌లోకి చొరబడి పదో తరగతి విద్యార్థినిపై

రంపంతో దాడి..!!

మరో బాలికకూ గాయాలు!

అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో దారుణం చోటుచేసుకుంది. పదో తరగతి విద్యార్థినిపై ఓ గుర్తుతెలియని వ్యక్తి చెట్ల కొమ్మలు కోసే రంపంతో దాడి చేశాడు. ఈ ఘటనలో బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడింది.



పాఠశాల అంటే విద్యార్థులకు భద్రతతో కూడిన విద్యాబుద్ధులు నేర్పించే ప్రదేశం. అలాంటి చోటే ఓ దారుణ ఘటన చోటుచేసుకుంది. తోటి విద్యార్థులతో కలిసి చదువుకునేందుకు స్కూల్‌కు వచ్చిన పదో తరగతి బాలికపై ఓ గుర్తుతెలియని వ్యక్తి రంపంతో దాడి చేశాడు. ముఖం, తల, వీపు భాగాలపై విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న బాలికను చూసి తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడింది. ఈ ఘటన అనంతపురం జిల్లా రాప్తాడు మండలంలో కలకలం రేపింది. రాప్తాడు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం స్కూల్ ప్రారంభమైన కొద్దిసేపటికే ఈ ఘటన చోటుచేసుకుంది. పదో తరగతి చదువుతున్న విద్యార్థిని తరగతి గదిలో ఉండగా ఓ గుర్తుతెలియని యువకుడు పాఠశాలలోకి ప్రవేశించాడు. తన వెంట తెచ్చుకున్న చెట్ల కొమ్మలు

రాప్తాడు ఘటన...

విద్యార్థిని తల్లికి ఫోన్ చేసి భరోసా ఇచ్చిన...

సీఎం చంద్రబాబు

- ధైర్యంగా ఉండాలని, నిందితుడిని పట్టుకుని కఠినంగా శిక్షిస్తాం
- విద్యార్థినిని కాపాడుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేద్దాం...
- ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు
- ఇరువురు విద్యార్థినిలకూ మెరుగైన వైద్య చికిత్స అందించాలి
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అమరావతి : అనంతపురం జిల్లా రాప్తాడు జెడ్పీ స్కూల్‌లో టెన్త్ విద్యార్థిని ఓ యువకుడు రంపంతో దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన విద్యార్థిని ప్రస్తుతం అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో బాధిత విద్యార్థిని తల్లితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోన్‌లో మాట్లాడారు. ధైర్యంగా ఉండాలని, నిందితుడిని పట్టుకుని కఠినంగా శిక్షిస్తామన్నారు. విద్యార్థినిని కాపాడుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేద్దామని.. ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విద్యార్థినికి అందుతున్న వైద్య సాయంపై స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీతతోనూ ముఖ్యమంత్రి మాట్లాడారు. ఉన్మాది దాడిలో గాయపడిన మరో విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. ఇరువురు విద్యార్థినిలకూ మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు.



అనంతపురం జిల్లా రాప్తాడు జెడ్పీ స్కూల్‌లో దాడికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని తల్లితో సీఎం చంద్రబాబు నాయుడు ఫోన్‌లో మాట్లాడారు.





జగన్ అక్రమాస్తుల కేసుల విచారణలో

పెరిగిన వేగం..!!

- ఇండియా సిమెంట్స్ కేసులో డిశ్చార్జి పిటిషన్లపై విచారణ ముగిసింది
- ఆరు సీబీఐ ఛార్జిషీట్లలో డిశ్చార్జి పిటిషన్లపై విచారణ పూర్తయింది
- భారతీ సిమెంట్స్ కేసులో డిశ్చార్జి పిటిషన్ల విచారణ మొదలైంది
- సీబీఐతో పాటు ఈడీ కేసుల్లోనూ రోజువారీ విచారణ జరుగుతోంది
- వీటన్నింటిపై ఒకేసారి సీబీఐ కోర్టు ఆదేశాలు వెలువరించనుంది

హైదరాబాద్: జగన్ అక్రమాస్తుల కేసుల విచారణలో వేగం పెరిగింది. ఇండియా సిమెంట్స్ కేసులో డిశ్చార్జి పిటిషన్లపై విచారణ ముగిసింది. ఇప్పటివరకు ఆరు సీబీఐ ఛార్జిషీట్లలో డిశ్చార్జి పిటిషన్లపై విచారణ పూర్తయింది. భారతీ సిమెంట్స్ కేసులో డిశ్చార్జి పిటిషన్ల విచారణ మొదలైంది. సీబీఐతో పాటు ఈడీ కేసుల్లోనూ రోజువారీ విచారణ జరుగుతోంది. సీబీఐ కోర్టులో ఇప్పటి వరకు మొత్తం 45 డిశ్చార్జి పిటిషన్లపై విచారణ పూర్తయింది. జగన్‌తో పాటు విజయసాయిరెడ్డి, బీపీ ఆచార్య, అయోధ్యరామిరెడ్డి, ధర్మాన ప్రసాదరావు, మోపిదేవి వెంకటరమణ, నిమ్మగడ్డ ప్రసాద్ తదితరుల డిశ్చార్జి పిటిషన్లపై ఇరువైపులా వాదనలు ముగిశాయి. వీటన్నింటిపై ఒకేసారి సీబీఐ కోర్టు ఆదేశాలు వెలువరించనుంది.



సంక్షేమ సాక్షి
తెలుగు దిన పత్రిక

స్కూల్‌లోకి చొరబడి పదో తరగతి విద్యార్థినిపై రంపంతో దాడి..!!

(మొదటిపేజ తరువాయి) కోసే రంపంతో బాలికపై దాడికి దిగాడు. ముఖం, తల, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థినిపైనా దాడి చేయడంతో ఆమె కూడా గాయపడింది. అప్పటివరకు తోటి విద్యార్థులతో కలిసి చదువుకుంటున్న బాలికలపై ఒక్కసారిగా దాడి జరగడంతో పాఠశాలలో భీతావహ వాతావరణం నెలకొంది. ఏం జరుగుతుందో అర్థం కాక విద్యార్థులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. అప్రమత్తమైన ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు పోలీసులకు సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న ప్రధాన బాధితురాలిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ దాడికి పాల్పడిన వ్యక్తి ఎవరు? విద్యార్థినికి తెలిసిన వ్యక్తేనా? వ్యక్తిగత కక్షలతో ఈ దారుణానికి పాల్పడ్డాడా? అనే కోణాల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే దాడికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. పిల్లల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఉండాల్సిన పాఠశాలలోనే ఇలాంటి ఘటన జరగడం తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఉదయం స్కూల్ ప్రారంభమైన సమయంలోనే ఓ వ్యక్తి లోపలికి చొరబడి విద్యార్థినులపై దాడికి పాల్పడటం పాఠశాలల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నిందితుడిని త్వరగా పట్టుకుని, దాడికి గల కారణాలను వెలికితీయాలని స్థానికులు కోరుతున్నారు.



ఏపీకి మరో తుఫాన్ ముప్పు..

భారీ వర్షాల హెచ్చరిక

(మొదటిపేజ తరువాయి) లోతట్టు ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు.

దేశంలో జనాభా లెక్కలకు షెడ్యూల్ రిలీజ్..

ఈ 5 రాష్ట్రాలకు మినహాయింపు..

దాదాపు 16 ఏళ్ల తర్వాత దేశంలో మళ్లీ జనాభా లెక్కలు జరగనున్నాయి. అవును తాజాగా 2027 జనవరి 25 నుంచి దేశ వ్యాప్తంగా జనాభా లేక్కల నిర్వహించబోతున్నట్టు కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్ రిలీజ్ చేసింది. అయితే కొన్ని రాష్ట్రాలకు మాత్రం ఇందులో మినహాయింపు ఇచ్చినట్టు తెలిపింది. కాబట్టి ఏఏ రాష్ట్రాల్లో జనాభా లెక్కలు నిర్వహించబోతున్నారో ఇక్కడ తెలుసుకుందాం.

ఎట్టకేలకు దేశవ్యాప్తంగా జనాభా లెక్కలు జరగబోతున్నాయి. దాదాపు 16 ఏళ్ల తర్వాత దేశవ్యాప్తంగా జనాభా లెక్కల నిర్వహణకు తాజాగా కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసింది. 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఈ జన గణన నిర్వహించనున్నట్టు కేంద్ర పేర్కొంది. అయితే ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలు, మంచు ప్రభావం ఎక్కువగా ఉండే రాష్ట్రాలకు మాత్రం ఈ లెక్కల నుంచి మినహాయింపు ఇస్తున్నట్టు కేంద్ర పేర్కొంది. పరిపాలనా పరమైన ఇబ్బందులు, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రకటన ప్రకారం.. జనాభా గణన ప్రక్రియను మొత్తం రెండు దశల్లో నిర్వహించనున్నారు. ఒకటి ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించడం, మరొకటి ప్రజలే స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకోవడం. ఈ రెండు విధాల్లో జనగణను చేయనున్నారు. అయితే సెల్ఫ్ ఎమ్యూనరేషన్ విధానాన్ని జనవర్ 10 నుంచే అందుబాటులోకి తీసుకురాబోతున్నట్టు అధికారులు షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఇక జనాభా గణనకు 2027 మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలను గడువును విధించింది ప్రభుత్వం. అంటే ఆ సమయానికి ఉన్న జనాభా వివరాలను ప్రామాణికంగా తీసుకుని ఈ లెక్కలు నమోదు చేయనున్నారు.



జనవరి 10 నుంచి స్వీయ గణనకు అవకాశం.. జనాభా గణనలో ప్రజలు సులభంగా పాల్గొనేందుకు ప్రభుత్వం స్వీయ గణన సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. 2027 జనవరి 10 నుంచి 24వ తేదీ వరకు ఈ అవకాశం ఉంటుంది. ఈ సమయంలో ప్రజలు తమ కుటుంబానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో స్వయంగా నమోదు చేసుకోవచ్చు. తద్వారా ఇంటింటికీ వెళ్లి అధికారులు వివరాలు సేకరించే ప్రక్రియకు ముందుగానే తమ సమాచారాన్ని అందించే వీలుంటుంది.

మినహాయింపు ఇచ్చిర రాష్ట్రాలు ఇవే?... అయితే 2027లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మణిపూర్, గోవా , ఉత్తరప్రదేశ్ , పంజాబ్ , ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు జనాభా లెక్కల నుంచి మినహాయింపు ప్రకటించారు. అలాగే మంచు ప్రభావం ఎక్కువగా ఉండే లడఖ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్ ప్రాంతాలకు కూడా ఈ షెడ్యూల్ నుంచి మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో పరిపాలనా పరమైన సవాళ్లు, శీతాకాలంలో మంచు కారణంగా ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. అయితే ఈ రాష్ట్రాలు, ప్రాంతాల్లో జనాభా లెక్కలు ఎప్పుడు నిర్వహిస్తారనే దానిపై మాత్రం ప్రభుత్వం ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు.

త్వరలో కొత్తగా రూ.1,000 నోటు?

అధికారుల క్లారిటీ

దేశంలో త్వరలోనే కొత్తగా రూ.1,000 నోటు చలామణిలోకి రానుందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పందించింది. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, అవన్నీ తప్పుడు ప్రచారాలని స్పష్టం చేసింది. కొత్త రూ.1,000 నోటు విడుదలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ , టెలిగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో పసుపు రంగులో ఉన్న ఒక రూ.1,000 నోటు ఫోటో విపరీతంగా వైరల్ అయ్యింది. కొత్త నోటును ఇప్పటికే విడుదల చేశారని, లేదా త్వరలోనే నిర్దిష్ట తేదీన అందుబాటులోకి తెస్తున్నారని ప్రచారం జరగడంతో ప్రజల్లో, నెటిజన్లలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ వివరణ ఇచ్చింది. రూ.1,000 నోటు మళ్లీ వస్తోందంటూ జరుగుతున్న ప్రచారాలను నమ్మవద్దని కోరింది. అధికారికంగా నిర్ధారణ కాని నిరాధారమైన పోస్టులను ఇతరులకు షేర్ చేయకూడదని ప్రజలకు సూచించింది. 2016 నవంబర్ 8న పెద్ద నోట్ల రద్దు సమయంలో పాత రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేశారు. ఆ తర్వాత కొత్త రూ.500 నోటును తీసుకొచ్చినప్పటికీ, రూ.1,000 నోటును పునరుద్ధరించలేదు. అంతేకాకుండా, ఆ సమయంలో ప్రవేశపెట్టిన రూ.2,000 నోటును కూడా 2023 మే నెలలో ఆర్‌బీఐ చలామణి నుంచి ఉపసంహరించుకుంది. ప్రస్తుతం ఆర్‌బీఐ మహాత్మా గాంధీ (న్యూ) సిరీస్‌లో కేవలం రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.200, రూ.500 నోట్లను మాత్రమే చలామణి చేస్తోంది. కాబట్టి ప్రచారంలో ఉన్న నకిలీ వార్తలను నమ్మవద్దని అధికారులు తేల్చి చెప్పారు.

సమాజంలో ఇలాంటి దాడులకు చోటు లేదు..

రాప్తాడు ఘటనపై పవన్ కల్యాణ్..

అనంతపురం జిల్లా రాప్తాడు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థినిపై దాడిని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. బాలిక తీవ్రంగా గాయపడిన విషయం తెలుసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై సంబంధిత అధికారులను ఆరా తీశారు.

అనంతపురం జిల్లా: రాప్తాడు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థినిపై ఓ యువకుడు దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. పాఠశాల తరగతి గదిలో ఉన్న పదో తరగతి బాలికపై చెట్లు నరికే రంపం యంత్రంతో ఓ యువకుడు దాడి చేశాడు. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించారు. విద్యార్థినిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. బాలిక తీవ్రంగా గాయపడిన విషయం తెలుసుకుని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై సంబంధిత అధికారులను ఆరా తీశారు. ఆమెకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా బాలిక కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని డిప్యూటీ సీఎం పవన్ భరోసా ఇచ్చారు. నిందితుడిని తక్షణమే అరెస్టు చేసి, చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి అమానవీయ ఘటనలకు సమాజంలో చోటు లేదని హెచ్చరించారు. కాగా, శనివారం ఉదయం పాఠశాలలో ఉన్న విద్యార్థినిపై ఓ యువకుడు దాడికి తెగబడ్డాడు. ఉపాధ్యాయురాలు మ్యాథ్స్ క్లాస్ చెబుతుండగా.. దుండగుడు హఠాత్తుగా తరగతి గదిలోకి ప్రవేశించాడు. అందరూ చూస్తుండగానే బాలికపై రంపం యంత్రంతో దాడి చేశాడు. ఈ ఘటనతో అక్కడున్న వారంతా నిర్ఘాంతపోయారు. తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ దాడిలో బాలిక ముఖం, తల, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది బాధితురాలిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. మరోవైపు, పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనాస్థలికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



దీపావళి వేళ సామాన్యులకు ఊరట..

దిగొచ్చిన కూరగాయల ధరలు..

తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల ధరలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ముఖ్యంగా దీపావళి పండుగ వేళ టమాటా, ఉల్లిపాయలతో సహా పలు నిత్యావసర కూరగాయల ధరలు పడిపోవడంతో సామాన్యులకు ఎంతో ఉపశమనం లభించింది. హైదరాబాద్, గుంటూరు రైతు మార్కెట్లలో ధరల వివరాలు చూద్దాం.

తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో వినియోగదారులకు భారీ ఊరట లభిస్తోంది. ముఖ్యంగా దీపావళి పండుగ వేళ ధరలు దిగిరావడం సామాన్యులకు ఎంతో మేలు చేకూరుస్తోంది. ఉల్లి, టమాటాలతో పాటు పలు ఇతర కూరగాయల ధరలు మొన్నటివరకు ఎగబాకగా.. ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయి. దీపావళి పండుగ రానుండటంతో ఇంటి ఖర్చు పెరుగనుంది. ఈ క్రమంలో కూరగాయల ధరలు దిగి రావడం శుభవార్తగా చెప్పవచ్చు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో అక్టోబర్ 31వ తేదీన ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.

హైదరాబాద్ మార్కెట్లో నేటి కూరగాయల ధరలివే... కూకట్‌పల్లి మోడ్రన్, మోడల్ రైతు బజార్‌లో శనివారం రోజున కిలో టమాటా రూ.27, వంకాయ రూ.18, బెండకాయ రూ.45, పచ్చి మిర్చి రూ.45, బజ్జి మిర్చి రూ.50, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.38, క్యాబేజీ రూ13, బీన్స్ రూ.60, క్యారెట్ రూ.45 పలుకుతుండగా.. గోబీపువ్వు రూ.30, దొండకాయ రూ.25, చిక్కుడుకాయ రూ.45, గోరుచిక్కుడు రూ.35, బీట్ రూట్ రూ.28, క్యాప్సికం రూ.47, ఆలుగడ్డ రూ.21, కీరా (లోకల్) రూ.28కు లభిస్తోంది. అలాగే కీరా (ఇటాలియన్) రూ.40, దోసకాయ రూ.23, సొరకాయ రూ.20, పొట్లకాయ రూ.24, కంద రూ.35, ఉల్లిపాయక రూ.55కు విక్రయిస్తున్నారు. ఇక కేజీ ఉల్లిగడ్డ రూ.40, పచ్చి మామిడికాయ ఒక్కొక్కటి రూ.15 నుండి రూ20, అరటికాయ ఒక్కొకటి రూ.9 నుండి రూ10, చామగడ్డ రూ35, ముల్లంగి ఒక్కొకటి రూ. 6 నుండి రూ8కి అమ్ముతున్నారు. ఇక చిలగడ దుంప రూ.40, గుమ్మడికాయ రూ.40, నిమ్మకాయలు (డజను) రూ.50 నుండి రూ60, మునగకాయలు ఒక్కొకటి రూ.10 నుండి రూ12, బొప్పాయి రూ50గా ఉంది. ఇక పుట్టగొడుగులు (200 గ్రాములు) రూ50, ఎండు మిర్చి రూ.280, పాత అల్లం రూ.180, కొత్త అల్లం రూ.120, వెల్లుల్లి రూ.60, చింతపండు రూ.160, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.80, కరివేపాకు రూ.60, పల్లికాయ రూ.55గా కొనసాగుతున్నాయి.



గుంటూరులో కూరగాయల ధరలు.. ఇక గుంటూరులోని ఎన్టీఆర్ రైతు బజార్‌లో కిలో టమాటా రూ.37, వంగ రూ.24, బెండ రూ.29, పచ్చిమిర్చి రూ.44, కాకర రూ.38, బీర రూ.44, క్యారెట్ రూ.42, క్యాబేజీ రూ.24. దొండ రూ.19, బంగాళదుంప రూ.24, ఉల్లి రూ.48, గోరుచిక్కుళ్లు రూ.24, దోస రూ.25, పొట్ల రూ.16,. చామ రూ.32, బీట్ రూట్ రూ.36, కీర రూ.45, క్యాప్సికం రూ.55,. అల్లం రూ.160, ఫ్రెంచిబీన్స్ రూ.75, సొర రూ.10, అరటి రూ.8, గోంగూరు రూ.8, తోటకూర రూ.20, చుక్కకూర రూ.20, మెంతికూర రూ.5, కొత్తిమీర రూ.50 పలుకుతోంది.

సంపాదకీయం

మోదీ పాలనతో దేశంలో..

పేదరికం తగ్గింది..

వరల్డ్ బ్యాంక్ లెక్కలే నిదర్శనమన్న కిషన్ రెడ్డి

నినాదాలు ఇవ్వడం కాదు.. పేదల జీవితాలను మార్చడమే అసలైన పరిపాలన అని ప్రధాని మోదీ నిరూపించారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. దేశంలో పేదరికం 57.7శాతం నుంచి 16.1 శాతానికి భారీగా తగ్గిందని ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన నివేదిక ఆధారంగా వెల్లడించారు. స్వచ్ఛ భారత్, ఉజ్వల, జల్ జీవన్ మిషన్ వంటి పథకాలతో దళారుల ప్రమేయం లేకుండా చివరి లబ్ధిదారుడి వరకు ఫలాలు అందించడం వల్లే ఈ చారిత్రక మార్పు సాధ్యమైందని స్పష్టం చేశారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతదేశం ఆధునిక చరిత్రలోనే అత్యంత వేగవంతమైన పేదరిక నిర్మూలనను సాధించినట్లు ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన నివేదిక స్పష్టం చేసిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రపంచ బ్యాంక్ పావర్టీ అండ్ ఈక్విటీ బ్రీఫ్ గణాంకాలను ఉటంకిస్తూ ఆయన శనివారం కీలక ప్రకటన విడుదల చేశారు. 2011 నుంచి 2023 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా ఏకంగా 49.6 కోట్ల మంది భారతీయులు దిగువ-మధ్యతరగతి పేదరిక రేఖ నుంచి బయటపడ్డారని, దీంతో దేశంలో పేదరిక రేటు 57.7 శాతం నుంచి 16.1 శాతానికి భారీగా తగ్గిందని తెలిపారు. అలాగే రోజుకు 3 డాలర్ల ఆదాయ పరిమితితో లెక్కించే తీవ్ర పేదరికం 27.1 శాతం నుంచి కేవలం 2.6 శాతానికి పడిపోయి, దాదాపుగా కనుమరుగయ్యే దశకు చేరిందని అన్నారు.

నినాదాలు కావు.. ప్రతి ఇంటా కనిపించే వాస్తవ మార్పులు... ఈ గణాంకాలు కేవలం కాగితాలకే పరిమితం కాలేదని, దేశంలోని ప్రతి పౌరుడి ఇంట్లో ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో 99.9 శాతం ఇళ్లకు విద్యుత్ సౌకర్యం లభించిందని, 2019 నాటికే గ్రామీణ పారిశుద్ధ్యం 100 శాతానికి చేరిందని వివరించారు. ఉజ్వల పథకం ద్వారా దాదాపు ప్రతి కుటుంబానికి ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ అందిందని, జల్ జీవన్ మిషన్ కింద 82 శాతానికి పైగా గ్రామీణ గృహాలకు నల్లా నీరు చేరుతోందని గుర్తుచేశారు. జాతీయ ఆహార భద్రతా చట్టం ద్వారా 57 శాతానికి పైగా ప్రజలకు రక్షణ కల్పించడంతో పాటు, 80 కోట్ల మందికి ఉచిత రేషన్ అందిస్తున్నామని తెలిపారు.

ఉపాధి రంగంలో గణనీయ పురోగతి.. కేన్సర్ ఔషధాల ధరల తగ్గింపు

2017 నుంచి 2023 మధ్య దేశంలో 13.4 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించబడ్డాయని, ఇది పని చేయగల వయస్సున్న జనాభా పెరుగుదల కంటే రెండింతలు అధికమని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలు మునుపెన్నడూ లేని రీతిలో ఉపాధి రంగంలోకి అడుగుపెట్టి లక్షలాది కుటుంబాలకు అదనపు ఆదాయాన్ని సమకూరుస్తున్నారని చెప్పారు. సామాన్యుల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తూ.. నవంబర్ 9 నుంచి 487 రకాల కేన్సర్ నిరోధక మందుల బ్రాండ్ల ధరలను తగ్గించామని, వీటిలో 276 రకాల మందుల ధరలు 50శాతం నుంచి 90శాతం వరకు తగ్గాయని తెలిపారు. దీనివల్ల బాధితులకు ఏటా సుమారు రూ. 2,500 కోట్ల వరకు ఆదా కానుందన్నారు.

సంక్షేమ పథకాలు మిషన్ మోడ్‌లో అమలు.. దళారుల వ్యవస్థకు చెక్

ఈ చారిత్రక మార్పు దానంతటదే రాలేదని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికత, సంకల్పం, అవిశ్రాంత శ్రమ వల్లే సాధ్యమైందని కిషన్ రెడ్డి కొనియాడారు. స్వచ్ఛ భారత్, సౌభాగ్య, ఉజ్వల, జల్ జీవన్ మిషన్ వంటి పథకాలను మిషన్ మోడ్‌లో నడిపించి, ఎలాంటి లీకేజీలు, దళారులు లేకుండా చివరి లబ్ధిదారుడి వరకు ప్రయోజనాలు అందేలా చేశారని వివరించారు.

కాంగ్రెస్ ఏళ్ల పాలనతో స్పష్టమైన వ్యత్యాసం.... గత కాంగ్రెస్ పాలనతో పోలిస్తే నేటి పరిస్థితి పూర్తి భిన్నంగా ఉందని కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. 2014లో కాంగ్రెస్ దిగిపోయే నాటికి గ్రామీణ పారిశుద్ధ్య కవరేజ్ కేవలం 38.7 శాతంగా, గ్యాస్ కనెక్షన్లు 55.9 శాతంగా మాత్రమే ఉన్నాయని గుర్తుచేశారు. తరతరాలుగా కాంగ్రెస్ పార్టీ గరీబీ హఠావో అంటూ బోగస్ నినాదాలతో కోట్ల మంది ప్రజలను కనీస సౌకర్యాలకు దూరం చేసిందని విమర్శించారు. మోదీ నినాదాలు ఇవ్వలేదని, నిజమైన అభివృద్ధిని చేసి చూపించారని స్పష్టం చేశారు.

పేదరికాన్ని అనుభవించిన నేత ప్రధాని మోదీ,.. మోదీ పేదరికాన్ని పుస్తకాల్లో చదివి తెలుసుకోలేదని, స్వయంగా అనుభవించి ఎదిగారని కిషన్ రెడ్డి తెలిపారు. వంటింట్లో పొగతో అల్లాడే తల్లి బాధ, తాగునీటి కోసం మైళ్ల దూరం నడిచే ఆడబిడ్డల వేదన, మందులు కొనలేని నిరుపేద కుటుంబాల ఆవేదనను దగ్గరుండి చూసిన నేత కాబట్టే వాటి నిర్మూలనకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. అలాంటి వాస్తవికత ఎరుగని రాహుల్ గాంధీ వంటి నేతలు పేదరికం గురించి ఎప్పటికీ అర్థం చేసుకోలేరని విమర్శించారు. 140 కోట్ల మంది ప్రజల భాగస్వామ్యంతో స్వయం సమృద్ధ -- వికసిత్ భారత్ నిర్మాణానికి ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని, పేదల జీవితాల్లో తెచ్చిన సానుకూల మార్పుల వల్లే దేశ ప్రజలు ప్రధాని మోదీ వెంటే దృఢంగా నిలబడ్డారని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

పెట్రోల్‌పై ఎగుమతి సుంకం రద్దు.. కేంద్రం కీలక నిర్ణయం

ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొన్న పరిస్థితుల్లో.. ఇంధన ఎగుమతులపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ ఎగుమతులపై విధించే స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీని రద్దు చేసింది. ఈ మేరకు ఇవాళ (శనివారం) ఆర్థిక శాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. అయితే డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఇంధనం (ఏటీఎఫ్) ఎగుమతులపై మాత్రం ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని ప్రభుత్వం పెంచింది. లీటర్ డీజిల్‌పై విధించే ఎగుమతుల సుంకాన్ని రూ.11.5కు పెంచగా.. లీటర్ ఏటీఎఫ్‌పై రూ.11కు పెంచింది. తాను జారీ చేసిన ఈ ఆదేశాలు తక్షణమే (అంటే అక్టోబర్ 31 నుంచి) అమలవుతున్నట్టు కేంద్రం ప్రకటించింది. గతంలో లీటర్ పెట్రోల్‌పై ఎగుమతి సుంకం రూ.2.5 ఉండగా.. ఇప్పుడు దీన్ని కేంద్రం రద్దు చేసింది. లీటర్ డీజిల్‌పై ఎగుమతి సుంకం రూ.8.5 ఉంటే.. ప్రస్తుతం రూ.11.5కు పెంచింది. అంటే ఈ సుంకం మూడు రూపాయలు పెరిగింది. అలాగే ఏటీఎఫ్‌పై రూ.10.5గా ఉన్న ఎక్సైజ్ డ్యూటీ రూ.11కు పెరిగింది. భారత్‌లో తయారు చేసి ఇతర దేశాలకు పంపించే డీజిల్,ఏటీఎఫ్‌పై ఈ ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకాన్ని విధిస్తారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా చమురు సంక్షోభం ఏర్పడిన విషయం తెలిసిందే. దీంతో గత మార్చి 27న ఇంధన ఎగుమతులపై భారత్ సుంకాలను ప్రవేశపెట్టింది. అప్పటి నుంచి 15 రోజులకు ఒకసారి ఈ సుంకాలను సవరిస్తూ వస్తోంది. స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీ రద్దు చేసినా రిటైల్ మార్కెట్‌లలో పెట్రోల్ ధరలు తగ్గవు. ప్రస్తుతం లీటరు పెట్రోల్ ధర హైదరాబాద్‌లో రూ.116.15గా ఉంటే.. విజయవాడలో రూ.117.25గా ఉంది. పెట్రోల్ ఎగుమతి సుంకాన్ని కేంద్రం రద్దు చేయడం వల్ల ఈ ధరల్లో ఎలాంటి మార్పూ ఉండదు.



రాప్తాడు పాఠశాలలో ఉన్మాది వీరంగం..

విద్యార్థినులపై దాడి దారుణం

విద్యార్థుల భద్రతకు భరోసా కల్పించాలి.. బాధ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి




పీలేరు, సంక్షేమ సాక్షి : అనంతపురం జిల్లా రాప్తాడులోని పాఠశాలలో చోటుచేసుకున్న దాడి ఘటనను ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం (ఏపీజీవైఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు తీవ్రంగా ఖండించారు. తరగతి గదిలోకి చొరబడిన వ్యక్తి విద్యార్థినిపై రంపంతో దాడి చేయడంతో పాటు, అడ్డొచ్చిన మరో విద్యార్థినిపై కూడా దాడి చేయడం అత్యంత దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళనలకు గురికావడం బాధాకరమన్నారు. పాఠశాలల్లోనే విద్యార్థులకు రక్షణ లేకపోవడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రత విషయంలో ప్రభుత్వం మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరిపి దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని పులి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో పటిష్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేసి విద్యార్థులకు రక్షణ కల్పించాలని ఆయన అన్నారు. “విద్యార్థుల ప్రాణాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలి” అని APGYSS రాష్ట్ర అధ్యక్షులు పులి శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

గాజుల నగరంలో రజిని ఇంటింటా ప్రచారం..

రామసముద్రం-2 ఎంపీటీసీ అభ్యర్థి రజిని గెలుపే లక్ష్యంగా గాజుల నగరంలో ముమ్మర ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

రామసముద్రం, అక్టోబర్ 31 (సంక్షేమ సాక్షి): రామసముద్రం మండలం రామసముద్రం-2 ఎంపీటీసీ అభ్యర్థి రజిని గాజుల నగరంలో విస్తృతంగా ఎన్నికల




ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను, ఓటర్లను ఆప్యాయంగా కలుసుకుంటూ తనకు మద్దతు తెలపాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని రజిని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రజినితో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

తనపల్లి, కుంట్రపాకంలో కూటమి అభ్యర్థుల

ఇంటింటి ప్రచారం

ఎంపీటీసీ పీరమ్మ, జెడ్పీటీసీ ముచ్చెలి ధనలక్ష్మికి మద్దతుగా ప్రచారం

తిరుపతి సంక్షేమ సాక్షి ప్రత్యేక ప్రతినిధి : మండలంలోని తనపల్లి, కుంట్రపాకం గ్రామాల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి



తరపున ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పీరమ్మ, జెడ్పీటీసీ అభ్యర్థి ముచ్చెలి ధనలక్ష్మికి మద్దతుగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా అభ్యర్థుల ఎన్నికల గుర్తులపై ఓటు వేయాలని ఓటర్లకు వివరించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు రమేష్ మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అదే తరహాలో తనపల్లి, కుంట్రపాకం గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డిఎం పురంలో కూటమి....

ఎన్నికల ప్రచార హోరు

ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించిన కూటమి నాయకులు.. టీడీపీలో చేరిన వైసీపీ కుటుంబం

తిరుమల సంక్షేమ సాక్షి ప్రత్యేక ప్రతినిధి : కార్వేటినగరం మండలంలోని డిఎం పురం ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. డిఎం పురం ఎంపీటీసీ టీడీపీ అభ్యర్థి వి. వరలక్ష్మికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఎంపీపీ అభ్యర్థి వినిది, మాజీ ఎంపీటీసీ ఎర్రగోటి రాధాకృష్ణ యాదవ్ ఓటర్లను కోరారు. జడ్పీటీసీ అభ్యర్థి కోనేరు బాలాజీ రెడ్డికి గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి విజయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. శనివారం డిఎం పురం, మిట్ట ఇండ్లు, మూలకండిగ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్. సతీష్‌కు చెందిన దళితవాడ కుటుంబం వినిది ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరింది. కూటమి ప్రభుత్వ అభివృద్ధి పనులకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయ డైరెక్టర్ రాధాకృష్ణ యాదవ్, మాజీ సర్పంచ్ వెంకటముని, ఎం. సుబ్రహ్మణ్యం, ధనంజయ యాదవ్, చెల్ల య్య,ఏనుమలై,బుజ్జి,మురళి, మధు ఆచారి, శేషాద్రి, తాకయ్య తదితరులు పాల్గొన్నారు.

పీలేరు కాంగ్రెస్ జడ్పిటిసి అభ్యర్థి షేక్ నౌజియాకు...

మద్దతుగా విస్తృత ప్రచారం

పీలేరు, సంక్షేమ సాక్షి : పీలేరు మండల కాంగ్రెస్ పార్టీ జడ్పిటిసిఅభ్యర్థి షేక్ నౌజియా ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం పీలేరు పట్టణంలోని పాత బస్టాండ్, సదుం రోడ్డు, గెండమాను వీధి తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బాలిరెడ్డి సోమశేఖర్ రెడ్డి పాల్గొని అభ్యర్థి షేక్ నౌజియాకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు, స్థానిక అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, మహిళల సంక్షేమం, యువతకు ఉపాధి వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తరఫున స్థానిక ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయడం, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలను నాయకులు ప్రస్తావించారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు దుబ్బ శ్రీకాంత్, సింగం రామకృష్ణ రెడ్డి, మల్లెల రెడ్డిబాష, తురక మల్లికా, S.K. భాష, అక్బర్, యూనిస్ తదితరులు పాల్గొన్నారు.





తెలివైన పిల్లలకోసం... అయోడిన్ ఉప్పు తప్పనిసరి

డాక్టర్ కావ్య గంద,డిప్యూటీ హెచ్. ఈ. ఓ. మహమ్మద్ రఫీ

కలికిరి, సంక్షేమ సాక్షి : తెలివైన పిల్లలకోసం అయోడిన్ ఉప్పు తప్పనిసరిగా వాడాలని మేడికుర్తి పి. హెచ్. సి. వైద్యులు డాక్టర్ కావ్యగంద మరియు డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖఅధికారి వారి ఆదేశాల మేరకు మండల కేంద్రం లోని గిరిజన కాలనీలో ప్రపంచ అయోడిన్ లోప వ్యాధుల నివారణ వారోత్స వాలలో(అక్టోబర్ 28నుండి నవంబర్ 5)సందర్భంగా స్థానిక పి హెచ్. సి. వైద్యులు డాక్టర్ కావ్యగంద ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెచ్. ఈ. ఓ. మహమ్మద్ రఫీ మాట్లాడుచు అయోడిన్ అనేది మన శరీరానికి చాలా అవసరమైన సూక్ష్మ పోషకం. ఇది థైరాయిడ్ గ్రంధి పనితీరుకు చాలా ముఖ్యం.అయోడిన్ లోపం వల్ల వచ్చే సమస్యలు గాయిటర్ (మెడ వాపు / గొంతు వాపు) పిల్లల్లో మెదడు ఎదుగుదల లోపం, మానసిక వికలాంగత్వం గర్భస్రావం, పుట్టుకతో వచ్చే లోపాలు పిల్లల్లో పొట్టిగా ఉండటం, చదువులో వెనుకబడటం అలసట, బరువు పెరగడం, చర్మం పొడిబారడం వంటి లక్షణాలు ఉంటాయి.నివారణ ఎలా అంటే అయోడైజ్డ్ ఉప్పు మాత్రమే వాడాలి.లి సాధారణ ఉప్పు కాకుండా టాటా సాల్ట్, ఆశీర్వాద్ లాంటి బ్రాండెడ్ కంపెనీల అయోడిన్ కలిగిన ఉప్పును వాడాలి. అయోడిన్ ఉన్న ఆహారాలు: సముద్రపు చేపలు, పాల ఉత్పత్తులు, గుడ్లు, పాలకూర వంటివి తరచుగా తినాలి. ఉప్పును గాలి తగలకుండా మూత ఉన్న డబ్బాలో నిల్వ చేయాలి. వండిన తర్వాత చివర్లో ఉప్పు వేయాలన్నారు. అనంతరం కోర్లగుంట గ్రామం లో ఉన్న సర్వోదయ వృద్ధాశ్రమము లో అంతర్జాతీయ వృద్ధుల మాసూత్సావము ముగింపు సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. షుగర్బీ. పి. పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగింది. ఆరోగ్యకరమైన జీవనశైలి మరియు టి. బి. వ్యాధి పట్ల అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో ఆరోగ్య పర్యవేక్షకులు వైద్యులు డాక్టర్ కావ్య గంద, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ,సర్వో దయ మేనేజర్ ఆదినారాయణ రెడ్డి పర్యవేక్షకులు సుధాకర్, ఎమ్. ఎల్. హెచ్. పి లు సైరా బాను, చందు ప్రియ, ఏ. ఎన్. ఎమ్ లు రమ దేవి, మల్లీశ్వరి,ఎమ్. ఆశాకార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు



మదనపల్లి మున్సిపల్ చైర్మన్ గా ఒక అవకాశం ఇవ్వండి...


వైయస్సార్సీపి చైర్మన్ అభ్యర్థి జింక వెంకటా చలపతి వినతి..

ప్రజలకు నీతివంతమైన పాలన అందిస్తా..

డయల్ యువర్ చైర్మన్ నిర్వహించి సమస్యలను పరిష్కారం చేస్తా..

జింక వెంకటా చలపతి హామీ...

మదనపల్లె, సంక్షేమ సాక్షి : మదనపల్లె మున్సిపల్ చైర్మన్ గా ఒకసారి గెలిపించే అవకాశాన్ని ప్రజలు కల్పించాలని వైఎస్ఆర్సిపి తరఫున పోటీ చేస్తున్న జింక వెంకటా చలపతి విన్నవించారు. శనివారం ఆయన చైర్మన్ గా గెలుపొందితే మదనపల్లె అభివృద్ధికి తను చేసే కార్యక్రమాల గురించి మీడియా ద్వారా తెలియజేశారు. మదనపల్లె ప్రజల సమస్యలు వినడానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఇకలేదు.అందుకే మన మదనపల్లెలో ప్రజలు, మున్సిపల్ చైర్మన్‌కు మధ్య నేరుగా అను సంధానం ఉండేలా “డయల్ యువర్ చైర్మన్” అనే కార్యక్ర మాన్ని తీసుకొని వస్తున్నాం. ప్రజల సమస్యలకు నేరుగా తెలుసుకొని వెంటనే పరిష్కారం చేస్తా.ఫిర్యాదులు, సూచనలు, అభ్యర్థనలకు తక్షణ స్పందనతో పరిష్కార మార్గం చూపుతాను. 24/7 ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజా ప్రతినిధిగా పేరు తీసుకుంటాను.ప్రజల గొంతుక వినిపించే వ్యవస్థ... ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చే పాలన... ప్రతి పౌరుడికీ అందుబాటులో ఉండే నాయకత్వం ఇప్పుడు మదనపల్లి ప్రజలకు అవసరం.చైర్మన్ అంటే కేవలం ఒక పదవి కాదు... ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే బాధ్యత.మన మదనపల్లె... మన బాధ్యత... ప్రజలే ప్రథమ ప్రాధాన్యత అని చైర్మన్ అభ్యర్థి జింకా వెంకట చలపతి మదనపల్లె ప్రజలకు తెలియజేశారు. ఆదివారం జరిగే మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్, 47 మంది కౌన్సిలర్ అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన విన్నవించారు.



మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

మదనపల్లి, పుంగనూరులో 152 పోలింగ్ కేంద్రాలు సిద్ధం...నవంబర్ 1న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్

ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలి : జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

మదనపల్లె సంక్షేమ సాక్షి ప్రత్యేక ప్రతినిధి : మదనపల్లి, పుంగ నూరు మున్సిపాలిటీల పరిధిలో నవంబర్ 1వ తేదీన నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వ హించనున్నట్లు పేర్కొన్నారు. మదనపల్లి మున్సిపాలిటీలోని 48 వార్డులు, పుంగనూరు మున్సిపాలిటీలోని 4 వార్డులకు ఎన్నికల నిర్వహణ కోసం మొత్తం 152 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో మదనపల్లిలో 144, పుంగనూరులో 8 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వెల్లడించారు.

మదనపల్లి మున్సిపాలిటీలో ఎన్నికల సామగ్రి పంపిణీ: మదనపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో పోలింగ్ సిబ్బందికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టారు. హెల్ప్ డెస్క్, ఆర్డర్స్ పంపిణీ, హాజరు నమోదు, ఎన్నికల సామగ్రి పంపిణీ కోసం 12 కౌంటర్లతో పాటు మైక్రో అబ్జర్వర్లు, రిజర్వ్ సిబ్బందికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల కోసం మొత్తంగా రిజర్వ్ తో కలిపి 1,111మంది పిఓ, ఏపీఓ, ఒపిఓ లు విధులకు హాజరయ్యారు. ఇందుకుగాను రిజర్వుతో కలిపి 25 మంది జోనల్ అధికారులు, 29 మంది రూట్ ఆఫీసర్లు, 48 బస్సులను ఏర్పాటు చేయడం జరిగింది. ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను మున్సిపల్ ఎన్నికల అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమీల పర్యవేక్షించారు. పోలింగ్ సిబ్బందికి ఆయా పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రిని అందజేశారు. సిబ్బందికి భోజన సదుపాయం కల్పించడంతో పాటు, జోన్, రూట్ల వారీగా ప్రత్యేకంగా కేటాయించిన బస్సుల ద్వారా వారిని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

పుంగనూరు మున్సిపాలిటీలో ఏర్పాట్లు: పుంగనూరు మున్సిపాలిటీలోని నాలుగు వార్డులకు సంబంధించి ఎనిమిది





పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల కోసం 24మంది పిఓ, ఏపీఓ, ఒపిఓ లు విధులకు హాజరయ్యారు. అదనంగా 9 మంది రిజర్వ్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామగ్రిని పంపిణీ చేసి, రెండు జోన్లు, రెండు రూట్లుగా విభజించి బస్సుల ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. సిబ్బందికి అల్పాహారం, భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం, మరుసటి రోజు ఉదయం అల్పాహారం అందించేలా ఏర్పాట్లు చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రత, మౌలిక సదుపాయాలు: ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన వెబ్‌కాస్టింగ్ సదుపాయాలు కల్పించడంతో పాటు మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేలా పటిష్ట పోలీసు బందోబ స్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా షేడ్స్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, దివ్యాంగులకు క్యూ లైన్లలో ప్రాధాన్యతనిస్తూ త్వరగా ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, భద్రతా సిబ్బందికి సూచించినట్లు పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళి అమలుపై చర్యలు: పోలింగ్ కేంద్రాల నుంచి 100 మీటర్ల పరిధిలో రాజకీయ పార్టీలు ఎలాంటి ఎన్నికల ప్రచారం నిర్వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. 100 మీటర్ల పరిధికి వెలుపల మాత్రమే ఎన్నికల నిబంధ నలకు అనుగుణంగా ఓటర్లకు సహాయం చేయవచ్చన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం 48 గంటల నిషేధ కాలంలో మద్యం విక్రయాలను నిలిపివేసినట్లు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో కార్మికులకు వేతనంతో కూడిన సెలవు కల్పించి నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచార గడువు ముగిసినందున నియోజకవర్గాలకు సంబంధం లేని బయటి వ్యక్తులు వెంటనే తమ స్వస్థలాలకు వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు తావులేకుండా తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ సాక్షి
తెలుగు దిన పత్రిక

ఎన్నికల్లో అక్రమాలు నిరూపిస్తే..
రాజీనామాకు సిద్ధం



అనంతపురం : పురపాలక ఎన్నికల్లో అక్రమాలు జరిగినట్లు నిరూపిస్తే తన మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ సవాల్ విసిరారు. ఓటమి భయంతో వైకాపా అధినేత జగన్ వ్యక్తిగత ఆరోపణలు, తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని విమర్శించారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జగన్ రాజకీయాల్లో శకునిలా వ్యవహరిస్తూ తెరవెనుక కుట్రలు చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. తనకు సంబంధించిన పాత ఆడియో సంభాషణలను వక్రీకరించి వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగుల సమస్యలపై తాను మాట్లాడిన అంశాలను కూడా బెదిరింపులుగా చిత్రీకరించారని విమర్శించారు. వైశ్యులను రాజకీయ పావులుగా ఉపయోగించుకోవడం తగదని, కులాల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు పొందాలని చూడటం సరికాదన్నారు. వ్యక్తిగత ఆరోపణలు, ఆధారాలు లేని ప్రచారాలు మానుకుని ప్రజా సమస్యలపై మాట్లాడాలని జగన్‌కు సూచించారు. పురపాలక ఎన్నికలు నిష్పక్షపాతంగా జరుగుతున్నాయని, అక్రమాలపై ఆధారాలు ఉంటే బయటపెట్టాలని మంత్రి పేర్కొన్నారు. మరో 24 గంటల్లో జరిగే ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పును వెల్లడిస్తారని, కూటమి ప్రభుత్వానికి మద్దతు పలుకుతారని సత్యకుమార్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.

అభివృద్ధిని చూసి...
ఓటేయండి..

కూటమి అభ్యర్థులను గెలిపించండి

గోరంట్ల: అభివృద్ధిని అడ్డుకుంటున్న వైకాపాకు ఓటుతో బుద్ధి చెప్పాలని, కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత ప్రజలకు పిలుపునిచ్చారు. గోరంట్ల మండలంలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా



ఆమె విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో, సీఎం చంద్రబాబు నాయకత్వంలో, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భాగస్వామ్యంతో కూటమి ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. గోరంట్ల మండలంలోని మారుమూల గ్రామాలకు రహదారులు కల్పిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ ప్రాంతానికి మరిన్ని పరిశ్రమలు రానున్నాయని, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీ నుంచి సుమారు 50 మందికి కియాలో ఉపాధి లభిస్తోందన్నారు. గోరంట్ల జడ్పీటీసీ జనసేన అభ్యర్థి సునేత్ర యాదవ్‌కు గాజు గ్లాసు గుర్తుపై, మందలపల్లి ఎంపీటీసీ అభ్యర్థి సావిత్రమ్మ కన్నారెడ్డి, పుట్టగుండ్లపల్లి అభ్యర్థి శారదాబాయి, నార్శింపల్లి అభ్యర్థి నాగభూషణ, బూదిలి అభ్యర్థి శ్రావణి, రెడ్డిచెరువుపల్లి అభ్యర్థి నిడిమామిడప్పలకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో కూటమి అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యర్రయ్యగారిపల్లిలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థి
గౌరమ్మకు మద్దతుగా జోరుగా ప్రచారం

గోరంట్ల : మండలంలోని కమ్మవారిపల్లి ఎంపీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గౌరమ్మకుమద్దతుగాయర్రయ్యగారిపల్లి గ్రామంలో శనివారంఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. వైఎ స్సార్‌సీపీ నాయకులు, కార్యకర్త లు



గ్రామంలోని పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా గౌరమ్మకు మద్దతుగా ఓట్లు అభ్యర్థిస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారంలో భాగంగా గ్రామంలోని ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యంగా గౌరమ్మకు అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ప్రచారాన్ని ముమ్మరం చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొత్తొల్ల వెంకట రంగారెడ్డి, మాజీ సర్పంచ్ మనీ శివశంకర్ రెడ్డి, బక్కుల రంగారెడ్డి, గుణశేఖర్ రెడ్డి, రామిరెడ్డి, ఎముకల గుట్లపల్లి లక్ష్మిరెడ్డి, కృష్ణారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, చండూరు వాండ్లపల్లి పార్వతిరెడ్డి, రాజు, ఆటో శివ, ఆది, కమ్మవారిపల్లి రాజారెడ్డి, భాస్కర్ రెడ్డి, రమేష్ గౌడ్, సమరసింహారెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం..

9.52 లక్షల మంది ఓటర్లు

అనంతపురం :







జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నవంబరు 1న అనంతపురం నగరపాలక సంస్థతోపాటు తాడిపత్రి, రాయదుర్గం, గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం మున్సిపాలిటీల్లో పోలింగ్ జరగనుంది. మొత్తం 480 వార్డులకు సంబంధించి 1,147 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఆరు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 9,52,997 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అధికారులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. మొత్తం ఓటర్లలో 4,65,148 మంది పురుషులు, 4,87,688 మంది మహిళలు, 161 మంది ఇతరులు ఉన్నారు. అనంతపురం నగరపాలక సంస్థలో 62 వార్డులు, 245 పోలింగ్ కేంద్రాలు, 2,37,007 మంది ఓటర్లు ఉన్నారు. తాడిపత్రిలో 48 వార్డులు, 96 పోలింగ్ కేంద్రాలు, 87,641 మంది ఓటర్లు; రాయదుర్గంలో 40 వార్డులు, 80 పోలింగ్ కేంద్రాలు, 53,696 మంది ఓటర్లు ఉన్నారు. గుంతకల్లులో 48 వార్డులు, 144 పోలింగ్ కేంద్రాలు, 1,13,855 మంది ఓటర్లు; గుత్తిలో 32 వార్డులు, 62 పోలింగ్ కేంద్రాలు, 39,008 మంది ఓటర్లు; కళ్యాణదుర్గంలో 32 వార్డులు, 62 పోలింగ్ కేంద్రాలు, 36,622 మంది ఓటర్లు ఉన్నారు.

4,960 మంది పోలింగ్ సిబ్బంది...
ఎన్నికల విధుల కోసం మొత్తం 4,960 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో 689 మంది ప్రిసైడింగ్ అధికారులు, 689 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 2,756 మంది ఇతర పోలింగ్ అధికారులు, 826 మంది రిజర్వ్ సిబ్బంది ఉన్నారు. అలాగే 111 సున్నిత, అతి సున్నిత ప్రాంతాల్లో పర్యవేక్షణ కోసం రిజర్వ్ సిబ్బందితో కలిపి 133 మంది మైక్రో అబ్జర్వర్లను కేటాయించారు.

2,500 మంది పోలీసులతో బందోబస్తు...
ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా దాదాపు 2,500 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు కల్పించనున్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

పోలింగ్ సామగ్రి పంపిణీ పూర్తి...
అనంతపురం నగరపాలక సంస్థకు ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో, గుంతకల్లులో సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో, తాడిపత్రిలో పాలిటెక్నిక్ కళాశాలలో, రాయదుర్గంలో ఏపీ మోడల్ స్కూల్‌లో, గుత్తిలో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో, కళ్యాణదుర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల నుంచి ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు.

మద్యం దుకాణాల మూసివేత... మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అక్టోబరు 30వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి నవంబరు 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు మద్యం దుకాణాలను మూసివేశారు. రీపోలింగ్ జరిగితే నవంబరు 2న, ఓట్ల లెక్కింపు జరిగే నవంబరు 3న కూడా మద్యం విక్రయాలు నిలిపివేయనున్నారు.

రెండు నెలలకు 75 వేల..
సదరం స్లాట్లు విడుదల

అమరావతి : దివ్యాంగులకు సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నవంబరు, డిసెంబరు నెలలకు సంబంధించి 75 వేల స్లాట్లను విడుదల చేయ నుంది. నవంబరు 2వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. సచివాలయాలు, వాట్సాప్‌లోని మనమిత్ర సేవలు, ఏపీ సేవ పౌర సేవా పోర్టల్ ద్వారా దివ్యాంగులు స్లాట్లు బుక్ చేసుకోవచ్చని వైద్య ఆరోగ్యశాఖ ప్రకటించింది. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో వైద్య విద్యా సంచాలకుల (డీఎంఈ), ద్వితీయ ఆరోగ్యశాఖ (డీఎస్‌హెచ్) పరిధిలోని 117 ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. సాఫ్ట్‌వేర్ సామర్థ్యాన్ని పెంచడంతో తొలుత నిర్ణయించిన 40 వేల స్లాట్లకు బదులుగా 75 వేల స్లాట్లకు బుకింగ్ అవకాశం కల్పించారు.


వారంలో వేర్వేరు రోజుల్లో పరీక్షలు..
డీఎంఈ పరిధిలోని ఆసుపత్రుల్లో 21 రకాల దివ్యాంగత్వాలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించే సదుపాయం ఉంది. ఈ ఆసుపత్రుల్లో వారానికి రెండు రోజుల చొప్పున, డీఎస్‌హెచ్ పరిధిలోని ఆసుపత్రుల్లో వారానికి ఒక రోజు చొప్పున పరీక్షలకు స్లాట్లు కేటాయించనున్నారు. దివ్యాంగులు తమ ప్రాంతానికి సమీపంలోని ఆసుపత్రుల్లోనే పరీక్షలు చేయించుకునేలా జోనల్ విధానంలో స్లాట్ బుకింగ్ కొనసాగుతుంది.

దివ్యాంగత్వ వివరాలు తప్పనిసరి.. స్లాట్ బుక్ చేసుకునే సమయంలో సంబంధిత వ్యక్తి తనకు ఉన్న దివ్యాంగత్వ వివరాలను తెలిసిన మేరకు నమోదు చేయాలి. అవసరమైతే సంబంధిత వైద్యుడి ద్వారా ధ్రువీకరించుకోవాలి. తప్పుడు దివ్యాంగత్వ కేటగిరీలో బుకింగ్ చేసుకుంటే వాటిని పరిగణనలోకి తీసుకోరు.

ఓటీపీతో పాత స్లాట్ల తొలగింపు... గతంలో బుక్ చేసుకున్న పాత స్లాట్లు లేదా సదరం గుర్తింపు సంఖ్యలను తొలగించుకునేందుకు ఓటీపీ ఆధారిత సేవ అందుబాటులో ఉంటుంది. 40 శాతం కంటే తక్కువ బెంచ్‌మార్క్ దివ్యాంగత్వం ఉన్నవారు ఓటీపీ ద్వారా అప్పీల్ వ్యవస్థలోకి ప్రవేశించి పాత స్లాట్ లేదా గుర్తింపు సంఖ్యను తొలగించుకోవచ్చు. ఈ ప్రక్రియలో పాత స్లాట్ స్వయంచాలకంగా రద్దవుతుంది. స్లాట్ బుకింగ్ అనంతరం జారీ చేసే అంగీకార స్లిప్పులపై సంబంధిత ఆసుపత్రుల సహాయ కేంద్రాల ఫోన్ నంబర్లను ముద్రించనున్నారు. స్లాట్ బుక్ చేసుకున్న తేదీ నుంచి ఆరు నెలల్లోగా వైద్య పరీక్షలకు హాజరుకాని వారి బుకింగ్‌లు స్వయంచాలకంగా రద్దవుతాయి. ఈసారి అదనంగా ఏపీ సేవ పౌర సేవా పోర్టల్ ద్వారా కూడా బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించారు.

మదిరెబైలు తాండాలో వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నాయకులు

బుక్కపట్నం: మండలంలోని మదిరెబైలు తాండాకు చెందిన పలువురు టీడీపీ నాయకులు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో ఎం. రాజుకుమార్ నాయక్, బి. రవినాయక్, ఎం. బాలు నాయక్, ఎం. విజయ్ నాయక్, ఎం. అమరనాథ్ నాయక్, ఎం. రమణ నాయక్, బి. రమణ నాయక్ ఉన్నారు.



నిందితుడిని కఠినంగా శిక్షిస్తాం

: పరిటాల సునీత

రాప్తాడు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై జరిగిన దాడి ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఈ ఘటనలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోపికను ఆమె పరామర్శించారు. దాడిలో గాయపడిన మరో విద్యార్థిని, ఘటనతో తీవ్ర ఆందోళనకు గురైన ఇంకో విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. అనంతరం కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న బాధితురాలి కుటుంబ సభ్యులను ఓదార్చారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఫోన్‌లో మాట్లాడించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారని సునీత తెలిపారు. ముగ్గురు నేతలూ ఫోన్ ద్వారా ఘటన వివరాలను తెలుసుకోవడంతోపాటు బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు. విద్యార్థినిపై దాడికి పాల్పడిన నిందితుడు ఎంతటివాడైనా చట్టప్రకారం కఠినంగా శిక్షిస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తి లేదని పరిటాల సునీత స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. బాధిత కుటుంబానికి మెరుగైన వైద్యంతోపాటు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయ సహకారాలను త్వరితగతిన అందిస్తామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల భద్రతకు ప్రతి పాఠశాలలో తగిన చర్యలు తీసుకోవాలని, మహిళలు, బాలికల రక్షణకు ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు.

మున్సిపల్ ఎన్నికల సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

అనంతపురం : మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సామగ్రి పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తెలిపారు. శనివారం తాడిపత్రి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలను అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శనివారం సాయంత్రంలోగా పోలింగ్ సామగ్రి పంపిణీ పూర్తి చేస్తామన్నారు. పోలింగ్ సిబ్బందికి భోజనం, వసతి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికల భద్రతకు 1,800 మంది పోలీసులను, క్యూల నిర్వహణకు 1,600 మంది సచివాలయ, ప్రభుత్వ సిబ్బందిని నియమించామన్నారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజలంతా తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, ఆర్ఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గాయపడిన విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలి

అనంతపురం : రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినిపై జరిగిన దాడిలో తీవ్రంగా గాయ పడిన బాలికకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ వైద్యాధికారులను ఆదేశిం చారు. శనివారం అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని, ఆమె కుటుంబ సభ్యులను కలెక్టర్ పరా మర్శించారు. బాలిక ఆరోగ్య పరిస్థితి ని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక వైద్య నిపుణులతో మెరుగైన చికిత్స అందించాలని, అవసరమైతే మరింత మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలి ంచేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అనంతరం బాధితురాలి తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు.



విద్యార్థినిపై దాడికి పాల్పడిన నిందితుడిని కచ్చితంగా పట్టు కుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలి పారు. ఈ కార్యక్రమంలో ప్రభు త్వ సర్వజన ఆసుపత్రి సూ పరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వ రి, అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నాణ్యత ఎంత ముఖ్యమో, పరిపాలనలో నిజాయితీ అంతే ముఖ్యం

అవినీతి రహిత పరిపాలన ప్రతి ఉద్యోగి నైతిక బాధ్యత...కొనుగోళ్లలో పారదర్శకత, నాణ్యత, నిబంధనల పాటింపు తప్పనిసరి

స్విమ్స్‌లో అవినీతిపై జీరో టాలరెన్స్ విధానం అమలు...విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డాక్టర్ గూడారు జగదీష్

తిరుపతి: సంక్షేమ సాక్షి : శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) నందు విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో





భాగంగా శ్రీ పద్మావతి ఆడిటోరియం విజిలెన్స్ అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ గూడారు జగదీష్ నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనం కలిగిన పరిపాలన ద్వారానే సంస్థాగత అభివృద్ధి సాధ్యమవుతుందని, అవినీతి రహిత వ్యవస్థతోనే ప్రజల్లో ప్రభుత్వ సంస్థలపై విశ్వాసం పెరుగుతుందని స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డాక్టర్ గూడారు జగదీష్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1 వరకు నిర్వహిస్తున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు--2026 సందర్భంగా స్విమ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ ఏడాది ''ప్రతిశీఎఱ్ఱఎ టశీతీ ప్రాతిశీంజూవతీఱ్ఱఎ'' (సమృద్ధి కోసం నిజాయితీ) అనే ఇతివృత్తం ఎంతో ప్రాధాన్యత కలిగినదని తెలిపారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు కేవలం ఒక కార్యక్రమానికి పరిమితం కాకుండా, ప్రతి ఉద్యోగి తన విధి నిర్వహణలో నైతిక విలువలు, నిజాయితీ, పారదర్శకత, బాధ్యతాయుత ప్రవర్తనలను పాటించేందుకు ఆత్మపరిశీలన చేసుకునే సందర్భమని ఆయన పేర్కొన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులు, ఆధునిక ఆపరేషన్ థియేటర్లు ఉన్నప్పటికీ, వాటి నిర్వహణలో నిజాయితీ, బాధ్యత, పారదర్శకత లేకపోతే సంస్థ లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించలేమని వివరించారు.

విజిలెన్స్ ప్రతి ఉద్యోగి బాధ్యత: విజిలెన్స్ అనేది కేవలం విజిలెన్స్ విభాగానికి సంబంధించిన అంశం కాదని, వైద్యులు, నర్సులు, ఫార్మసిస్టులు, ఇంజినీర్లు, పరిపాలనా అధికారులు, అకౌంట్స్ సిబ్బంది, కొనుగోళ్ల విభాగం ఉద్యోగులు మొదలుకొని పారిశుద్ధ్య కార్మికుల వరకు ప్రతి ఒక్కరి బాధ్యత అని డాక్టర్ జగదీష్ గారు స్పష్టం చేశారు. విధులను నిబద్ధతతో నిర్వహించడం, రికార్డులను సక్రమంగా నిర్వహించడం, ప్రభుత్వ వనరులను దుర్వినియోగం కాకుండా చూడటం, రోగులకు వివక్ష లేకుండా సేవలందించడం కూడా విజిలెన్స్‌లో భాగమేనని తెలిపారు. తప్పు జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, తప్పులు జరగకుండా ముందుగానే నివారించడమే ఉత్తమ విజిలెన్స్ విధానమని పేర్కొన్నారు.

నివారణాత్మక విజిలెన్స్‌కు ఐదు ప్రాధాన్యతా అంశాలు: కేంద్ర విజిలెన్స్ కమిషన్ సూచించిన నివారణాత్మక విజిలెన్స్ కార్యక్రమంలో ఐదు ముఖ్యమైన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన వివరించారు. 1. పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారం: ఉద్యోగులు, రోగులు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిష్పక్షపాతంగా పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలి. 2. పెండింగ్ కేసుల పరిష్కారం: పరిపాలనా, క్రమశిక్షణ, విజిలెన్స్ తదితర కేసులను సమీక్షించి, అనవసర జాప్యం లేకుండా నిబంధనల ప్రకారం పరిష్కరించాలి. 3. సిబ్బంది సామర్థ్య పెంపు: ఆర్థిక, పరిపాలనా, సేవా నిబంధనలపై ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి. సరైన అవగాహనతో అనేక పరిపాలనా తప్పిదాలను నివారించవచ్చని తెలిపారు. 4. డిజిటల్ విధానాల బలోపేతం: రోగుల నమోదు, బిల్లింగ్, ఔషధాల పంపిణీ, కొనుగోళ్లు, ఆర్థిక లావాదేవీలు, సిబ్బంది పరిపాలన తదితర అంశాల్లో డిజిటల్ విధానాలను విస్తృతంగా వినియోగించడం ద్వారా పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని పేర్కొన్నారు. 5. కాంట్రాక్టుల నిర్వహణ: వైద్య పరికరాలు, మందులు, శస్త్రచికిత్సకు అవసరమైన సామగ్రి, ల్యాబ్ రీ ఏజెంట్స్, పారిశుద్ధ్యం, భద్రత, ఇంజినీరింగ్ పనులు, నిర్వహణ సేవలకు సంబంధించిన కొనుగోళ్లు, ఒప్పందాల్లో నాణ్యత, పారదర్శకత, న్యాయబద్ధత పాటించాలని సూచించారు. ప్రతి రూపాయి ప్రజాధనం సక్రమంగా వినియోగమై సంస్థకు తగిన ప్రయోజనం చేకూర్చాలని తెలిపారు.

వైద్య సంస్థల్లో విజిలెన్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యత: ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన అనేక మంది రోగులు చికిత్స కోసం సుదూర ప్రాంతాల నుంచి స్విమ్స్‌కు వస్తుంటారని, వారికి చిన్నపాటి పరిపాలనా జాప్యం కూడా పెద్ద ఇబ్బందిగా మారుతుందని డాక్టర్ జగదీష్ పేర్కొన్నారు. అందువల్ల రోగులకు వివక్ష లేకుండా గౌరవప్రదమైన, సకాలంలో నాణ్యమైన వైద్యసేవలు అందించడం, ప్రభుత్వ నిధులు, మందులు, వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలను బాధ్యతాయుతంగా వినియోగించడం, సంస్థ ప్రతిష్ఠను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

అన్ని విభాగాలు జవాబుదారీతనంతో పనిచేయాలి: స్విమ్స్‌లోని అన్ని విభాగాలు అవినీతిపై ఏమాత్రం ఉపేక్ష చూపకుండా పనిచేయాలని, పెండింగ్ ఫైళ్లు, అనుమతులు, ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ప్రతి ఖర్చుకు తగిన సమర్థన, అనుమతి, రికార్డు ఉండాలని, మందులు, వైద్య పరికరాలు, ఇతర వనరులు వృథా కాకుండా సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ప్రతి ఉద్యోగి తన విధుల పట్ల బాధ్యత వహిస్తూ, రోగుల పట్ల మానవత్వం, సేవాభావం, గౌరవంతో వ్యవహరించాలని కోరారు. అంతర్గత ఆడిట్లు, విభాగాల వారీ సమీక్షలు, ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని తెలిపారు.

నిజాయితీనే స్విమ్స్ గుర్తింపుగా నిలవాలి: పరిపాలనలో నిజాయితీ, వ్యవస్థలో పారదర్శకత, విధి నిర్వహణలో జవాబుదారీతనం, వైద్యసేవల్లో మానవత్వం కలిసినప్పుడే సంస్థాగత నాణ్యత, ప్రజల విశ్వాసం శాశ్వతంగా నిలుస్తాయని తెలిపారు. Probity for Prosperity అనే ఇతివృత్తాన్ని కేవలం నినాదంగా కాకుండా, ప్రతి నిర్ణయంలో, ప్రతి లావాదేవీలో, ప్రతి విభాగంలో, ప్రతి రోగికి అందించే సేవలో ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. స్విమ్స్‌ను నైతిక విలువలు, పారదర్శక పరిపాలన, నాణ్యమైన వైద్యసేవలకు ఆదర్శ సంస్థగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించిన అకౌంట్స్ విభాగం మరియు నిర్వాహకులను అభినందించారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న నివారణాత్మక విజిలెన్స్ కార్యక్రమాల్లో స్విమ్స్ కుటుంబ సభ్యులందరూ చురుకుగా పాల్గొని సంస్థ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. నిజాయితీ మన గుర్తింపుగా, పారదర్శకత మన బలంగా, జవాబుదారీతనం మన సంస్కృతిగా, రోగుల సంక్షేమం మన పరమావధిగా స్విమ్స్ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్విమ్స్ డీన్ డాక్టర్ అలోక్ సచన్ విజిలెన్స్ అవేర్నెస్ వీక్ లో భాగంగా స్విమ్స్ ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నిరంజన్ కుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్, విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్మెంట్, తిరుపతి ని స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్ శాలువాతో సత్కరించి, మెమెంటో బహూకరించారు. ఈ కార్యక్రమానికి స్విమ్స్ డీన్ డాక్టర్ అలోక్ సచన్, డాక్టర్ రామ్, ముఖ్యఅతిథి నిరంజన్, డాక్టర్ సుధారాణి, డాక్టర్ మాధవి, డాక్టర్ శర్వాణి, చీఫ్ అకౌంట్ ఆఫీసర్ గోపి మరియు వివిధ విభాగాధిపతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలికిరి కేవికేలో పుట్టగొడుగుల.. పెంపకంపై శిక్షణ

59 మంది రైతులు, యువత, మహిళలు హాజరు

కలికిరి, సంక్షేమ సాక్షి : కలికిరి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులు, గ్రామీణ యువత, మహిళలకు ముత్యపుచిప్ప మరియు పాల పుట్టగొడుగుల సాగుపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ముగిసింది. కేవికే హెడ్ డా. కె. మంజుల మాట్లాడుతూ పుట్టగొడుగుల పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలు వివరించి, చిన్న స్థాయిలో ప్రారంభించి మంచి లాభాలు పొందవచ్చని సూచించారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డా. వై. పీరూ సాహెబ్ మాట్లాడుతూ బెడ్ తయారీ, ఉష్ణోగ్రత, తేమ, స్పాన్ ఎంపిక గురించి వివరించారు. రైతులతో వరిగడ్డిని శుద్ధి చేసి బెడ్లు తయారు చేయించి, విత్తనం అమర్చి డార్క్ రూమ్ లో పేర్చారు. 21 రోజుల తర్వాత వెలుతురు గదిలోకి మార్చి, మరో 15 రోజులకు మొదటి కోత తీసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో 59 మంది పాల్గొన్నారు. కేవికే శాస్త్రవేత్తలు ఎస్. సోమశేఖర్ బాబు, డా. కె. మాధురి, డా. ఎ. శ్రీనివాసులు, జిల్లా వనరుల అధికారి రామకృష్ణ రాజు, ఆత్మ అధికారి అమృత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.




అర్ధగిరి ఆలయానికి రామ్ రక్షను తీసుకువస్తున్న ఉపాసన

ఇన్‌స్టాగ్రామ్‌లో అరగొండ అనుభవాలు పంచుకున్న ఉపాసన

చిత్తూరుతో కుటుంబ అనుబంధం.. మహిళా సాధికారతకు కృషి

చిత్తూరు, అక్టోబర్ 31, సంక్షేమ సాక్షి : అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి మనవరాలు ఉపాసన కామినేని కొణిదెల చిత్తూరు జిల్లాతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని చాటుకున్నారు. అరగొండలోని ప్రసిద్ధ అర్ధగిరి ఆంజ నేయస్వామి ఆలయానికి రామ్ రక్షను తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. అరగొం డలో తన అనుభవాలను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకున్నారు. ఈ ప్రాంత మహిళల అభ్యున్నతి, ఆరోగ్యం, విద్య, ఆర్థిక స్వావలంబనకు కృషి చేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి జన్మస్థలం చిత్తూరు కావడంతో ఈ ప్రాంతం తన కుటుంబానికి ఎంతో ప్రత్యేకమని ఉపాసన పేర్కొన్నారు. వైద్య సేవలతో పాటు సమాజ అభ్యున్నతికి, దేశ నిర్మాణానికి తన తాత చేసిన కృషి తనకు స్ఫూర్తినిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిత్తూరు తన తాత జన్మించిన ప్రాంతం మాత్రమే కాదని, తాను గర్వంగా సొంత ప్రాంతంగా భావించే నేల అని పేర్కొన్నారు. సమాజంలోని ప్రజల అభ్యున్నతికి కృషి చేయడమే నిజమైన దేశ నిర్మాణమని తన తాత నేర్పించారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ మహిళలు ఆరోగ్యంగా, ఆత్మవిశ్వాసంతో జీవించేందుకు, విద్యాపరంగా ఎదిగేందుకు, ఆర్థికంగా స్వతంత్రులుగా నిలిచేందుకు తన వంతు కృషి చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. ఒక మహిళ సాధికారత సాధిస్తే ఒక కుటుంబం బలపడుతుందని, కుటుంబాలు బలపడితే దేశం మరింత శక్తిమంతంగా మారుతుందని ఉపాసన అభిప్రాయపడ్డారు. మహిళల ఆరోగ్యం, విద్య, ఆర్థిక స్వాతంత్ర్యానికి ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉందన్నారు. హనుమంతుడు సంజీవని పర్వతాన్ని తీసుకువచ్చిన పురాణ గాథతో అనుబంధం కలిగిన అర్ధగిరి క్షేత్రం భక్తి, విశ్వాసం, ఆరోగ్యం, స్వస్థతకు ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. చిత్తూరు ప్రాంతంతో ఉన్న కుటుంబ అనుబంధాన్ని సేవా కార్యక్రమాల ద్వారా కొనసాగించాలన్నది తన ఆకాంక్షగా ఉపాసన వెల్లడించారు. మహిళల ఆరోగ్యం, విద్య, ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యమిస్తూ చిత్తూరు ప్రాంత మహిళల అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు.



సెహబాష్...ఖాజా

ఏకగ్రీవ ఎంపిటిసి ఖాజాను అభినందించిన ఎం ఎల్ ఏ నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి

పీలేరు, సంక్షేమ సాక్షి : పీలేరు నియోజకవర్గ సాయి సీనియర్ ముస్లిం మైనార్టీ నేత షేక్ జాఫర్ సాబ్ వారసుడిగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఆయన తనయుడు ఖాజా





ను పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అభినందించారు. ఖాజా 8వ ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు , ఈయన తండ్రి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి విధేయుడుగా ఉంటూ వచ్చారు,ఎమ్మెల్యే అభ్యర్థులు మారిన జాఫర్ సాబ్ పార్టీని వీడ కుండా విధేయుడు గా ఉన్నారని ఆయన సమకాలీకులు చెబుతుంటారు. మండల కో ఆప్షన్ సభ్యునిగా ఆయన సేవలందించారు. పట్టణంలోని ముస్లింలకు తన వంతు అందరి కి తన సేవలు అందించి మన్ననలు చూర గొన్నారు. ఆయన బాటలోనే ఆయన తనయుడు ఖాజా మైనార్టీ లకు సేవలు అందిస్తారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.



ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి ,పార్టీ సీనియర్ నేతలకు తన కృతజ్ఞతలు తెలిపారూ.తాను సైతం మైనారిటీ లకు సేవలందిస్తాని ఖాజా ఈ సందర్భంగా తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా వ్యాప్తంగా 2,500 మంది పోలీసులతో పటిష్ట భద్రత

- సున్నిత, అత్యంత సున్నిత పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, మైక్రో అబ్జర్వర్ల పర్యవేక్షణ

జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి, అక్టోబర్ 31, సంక్షేమ సాక్షి : తిరుపతి నగరపాలక సంస్థతో పాటు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో నవంబర్ 1న నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం ఉదయం స్థానిక ఎస్ వి ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ ఎం. జయకృష్ణతో కలిసి పరిశీలించిన కలెక్టర్, పోలింగ్ పార్టీలకు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇతర ఎన్నికల సామగ్రి పంపిణీ తీరును సమీక్షించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన వసతులు, రవాణా ఏర్పాట్లు కల్పించినట్లు తెలిపారు. నవంబర్ 1వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఓటర్లు తమ ఓటరు స్లిప్పులో పేర్కొన్న పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 90 శాతం ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తయిందని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులు, వృద్ధులు, మహిళా ఓటర్లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంతో పాటు క్యూ నిర్వహణకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలను వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల భద్రత కోసం జిల్లా వ్యాప్తంగా సుమారు 2,500 మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. సున్నిత, అత్యంత సున్నిత పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, ప్రత్యామ్నాయంగా వీడియో రికార్డింగ్ ఏర్పాటు చేశామని, ప్రతి పోలింగ్ కేంద్రంలో మైక్రో అబ్జర్వర్లను నియమించి ఎన్నికల ప్రక్రియను స్వతంత్రంగా పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా సంబంధిత మున్సిపల్ పరిధిలో మద్యం దుకాణాలను మూసివేసినట్లు తెలిపారు. అధికారులు, సిబ్బంది ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ సమన్వయంతో పనిచేయాలని, ప్రతి ఓటరు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భరత్ నాయక్, తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





మీ సేవలకు సలాం

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఎమోషనల్ ట్వీట్

అమరావతి, సంక్షేమ సాక్షి ప్రత్యేక ప్రతినిధి : అర్నబ్ తుపాను మిగిల్చిన చీకట్లను తరిమికొట్టేందుకు విద్యుత్ సిబ్బంది చేస్తున్న పోరాటానికి మంత్రి ఫిదా పాలకొల్లు సెక్షన్



పరిధిలోని ఆగర్తిపాలెం సిబ్బంది పనితీరును ప్రశంసించిన మంత్రి గొట్టిపాటి 11కేవీ పునరుద్ధరణ కోసం సిబ్బంది చేస్తున్న కార్య దీక్షను కొనియాడుతూ ట్వీట్ చేసిన మంత్రి చుట్టూ జడివాన, మెడ లోతు చేపల చెరువుల్లో, ప్రాణాలను లెక్క చేయకుండా పని చేస్తున్న సిబ్బందిని అభినందించిన మంత్రి గొట్టిపాటి కేవలం డ్యూటీ మాత్రమే కాదు,ప్రజాసేవలో ప్రాణాలర్పించే అంకితభావం మీ సొంతమని ప్రశంస ,క్షేత్రస్థాయిలో నిలబడి పోరాడుతున్న ప్రతి విద్యుత్ కార్మికుడికి, అధికారిక బృందానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా మీ ఇంట్లో వెలుగులు నింపేందుకు పని చేస్తున్న విద్యుత్ సిబ్బంది అంకిత భావాన్ని అర్థం చేసుకోవాలి వినతి పునరుద్ధరణ పనులు పూర్తయ్యేంత వరకు సంయమనం పాటిస్తూ, వారికి అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నాను. వీరి సేవలో పీలేరు ట్రాన్స్కో డివిజన్ పరిధిలో రెండు బృందాలు గా సిబ్బంది బయలు దేరి వెళ్లినట్లు ఈ ఈ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. తమ సిబ్బంది గత మూడు రోజులుగా తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో శ్రమిస్తున్నారని




సంక్షేమ సాక్షి
తెలుగు దిన పత్రిక

జూనియర్ టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపిక

- నవంబర్ 3న విందూరులో ట్రయల్స్

గూడూరు, అక్టోబర్ 31(సంక్షేమ సాక్షి ప్రతినిధి) : ఉమ్మడి నెల్లూరు జిల్లా మరియు తిరుపతి జిల్లా జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపిక నవంబర్ 3వ





తేదీ ఉదయం 10 గంటలకు విందూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు నిర్వహిస్తున్నట్లు తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బండి శ్యామసుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్) తెలిపారు. 2008 జనవరి 1వ తేదీన గాని, ఆ తర్వాత గాని జన్మించిన విద్యార్థినీ విద్యార్థులు ఈ ఎంపికకు అర్హులని, హాజరయ్యే క్రీడాకారులు తప్పనిసరిగా పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 11, 12 తేదీలలో అనకాపల్లిలో జరిగే 43వ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలలో పాల్గొంటారు. మరిన్ని వివరాలకు లిపైడి కోటేశ్వరరావు, పీఈటీ – 7382111262, కె. మల్లిఖార్జున, పీఈటీ – 98857 73208లి లను సంప్రదించగలరు.

ప్రశాంత వాతావరణంలో
స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా మున్సిపల్
ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రత

- సున్నిత, అత్యంత సున్నిత పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, మైక్రో

అబ్జర్వర్ల పర్యవేక్షణ : జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

నాయుడుపేట, అక్టోబర్ 31: (సంక్షేమ సాక్షి ప్రతినిధి): తిరుపతి నగరపాలక సంస్థతో పాటు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో నవంబర్ 1వ తేదీన నిర్వహించనున్న



మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం నాయుడుపేటలోని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని, కౌంటింగ్ కేంద్రాలను సూళ్లూరుపేట ఆర్డీఓ దేవేంద్ర రెడ్డి, నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఫాజీలుల్లాతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ పార్టీలకు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇతర ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియను సమీక్షించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన వసతులు, రవాణా సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి నగరపాలక సంస్థతో పాటు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో నవంబర్ 1వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఓటర్లు తమ ఓటరు స్లిప్పులో పేర్కొన్న పోలింగ్ కేంద్రానికి చేరుకుని ప్రజాస్వామ్య హక్కైన ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే 90 శాతానికి పైగా ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తయినదని తెలిపారు. అలాగే గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులు, వృద్ధులు, మహిళా ఓటర్లకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంతో పాటు, పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా క్యూ నిర్వహణకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలను వినియోగించనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జిల్లా వ్యాప్తంగా సుమారు 2,500 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. సున్నిత, అత్యంత సున్నిత పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, ప్రత్యామ్నాయంగా వీడియో రికార్డింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో మైక్రో అబ్జర్వర్లను నియమించి, ఎన్నికల ప్రక్రియను స్వతంత్రంగా పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా సంబంధిత మున్సిపల్ పరిధిలోని మద్యం దుకాణాలను మూసివేసినట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ పరస్పర సమన్వయంతో విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఓటరు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, నాయుడుపేట, ఓజిలి తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎలక్షన్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌ను
పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు

తిరుపతి, అక్టోబర్ 31 : (సంక్షేమ సాక్షి ప్రతినిధి): తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల పరిశీలకులు శ్రీ ఎమ్. వరప్రసాద్ ఐఆర్ఎస్ గారు శని వారం



తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎలక్షన్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎలక్షన్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ మరియు మైక్రో అబ్జర్వర్ నిర్వహణ విధానాన్ని పరిశీలించి, ఎన్నికల ప్రక్రియ నిబంధనల ప్రకారం సజావుగా జరిగేలా చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లను, స్ట్రాంగ్ రూమ్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భరత్ నాయక్, తదితర అధికారులు పాల్గొన్నారు.

రామకృష్ణాపురంలో విజయం మాదే, మెజారిటీ కోసమే ప్రచారం

- ఎంపీటీసీ అభ్యర్థి వీరభద్ర

పెనుమూరు, అక్టోబరు31 (సంక్షేమ సాక్షి ప్రతినిధి):- మండలంలోని రామకృష్ణాపురం ఎంపీటీసీ సెగ్మెంటులో వైఎస్ఆర్‌సీపీ దే విజయం అని, మెజారిటీని పెంచుకోవడానికే ప్రచారం చేస్తున్నామని ఆ పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి వీరభద్ర అన్నారు. శనివారం గుంటూరువాండ్లపూరు, చిప్పారపల్లి, హరిజనవాడ, పాళ్యంయానాదికాలని, పాళ్యంకొత్తూరు, గంధపుపొడివారిపల్లి, గాంధీపురం గ్రామాలలో వైసీపీ శ్రేణులు జోరుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి వీరభద్ర మాట్లాడుతూ ఈ రామకృష్ణాపురం సెగ్మెంటు వైసీపీకి కంచుకోట అని, ఎవరు వచ్చినా మా పార్టీపై ఇక్కడ గెలవలేరని అన్నారు. విజయం ఎప్పుడో వైసీపీ కి ఖాయమయ్యిందని, కేవలం మెజారిటీని పెంచుకోవడం కోసమే జోరుగా ప్రచారం చేస్తున్నామని అన్నారు. నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ, ఊరి కష్టసుఖాల్లో తోడుగా నిలిచే నాయకుడిగా వీరభద్ర గారికి రామకృష్ణాపురంలో అపూర్వమైన ప్రజాదరణ ఉండడంతో గడప గడపలో ఆయనను ఆదరిస్తూ, అపూర్వమైన స్వాగతం పలుకుతు న్నారు. గతంలో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అందించిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ ఫలాలను ఇంటింటికీ వివరిస్తూ వీరభద్ర ప్రచారంలో ముందుకు సాగారు. రామకృష్ణాపురం సెగ్మెంటు పరిధిలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన మరియు అభివృద్ధి సాధించడమే తన



ప్రధాన ధ్యేయమని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఫ్యాను గుర్తుపై ఓటేసి ఎంపీటీసీ అభ్యర్థి వీరభద్ర మరియు పెనుమూరు మండల జడ్పీటీసీ అభ్యర్థి నిరీసాగిరిధర్ రెడ్డిని గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు నాగిరెడ్డి నరసింహారెడ్డి, దూదివెంకటేశ్, నాయకులు దూదిమోహన్, గోవిందరెడ్డి, త్యాగరాజులు, హరిక్రిష్ణారెడ్డి, జ్యోతీశ్వర్ పలువురు నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటరు గుర్తింపు కోసం ఎన్నికల సంఘం నిర్దేశించిన
12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తీసుకురావాలి

ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

విజయవాడ: అక్టోబరు 31 (సంక్షేమ సాక్షి ప్రతినిధి): రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన అమూల్యమైన ఓటు హక్కును ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి,



జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. నవంబర్ 1వ తేదీన నిర్వహించనున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. నవంబర్ 1వ తేదీన ఉదయం 7.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతి ఒక్కరూ నిర్దిష్ట సమయంలో తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయాలని సూచించారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఓటరు జాబితాలో పేరున్నవారు ఓటు వేసేందుకు వెళ్లేటప్పుడు ఎన్నికల సంఘం నిర్దేశించిన 12 రకాల ప్రత్యామ్నాయ గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదాన్ని తప్పనిసరిగా వెంట తీసుకెళ్లాలని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు.

గుర్తింపు కోసం అనుమతించిన 12 రకాల కార్డులు: ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, పాస్‌పోర్ట్, పోస్టాఫీసు పాస్‌బుక్, ఉపాధి హామీ పథకం వేతన జాబ్ కార్డు, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు, పెన్షన్ డాక్యుమెంట్, సర్వీస్ ఐడెంటిటీ కార్డు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్‌పీఆర్), స్మార్ట్ కార్డు,ఎంపీ,ఎమ్మెల్యే,ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపుకార్డు,వికలాంగుల గుర్తింపు కార్డు.

ప్రచారంలో అరుణకు బ్రహ్మరథం పడుతున్న ప్రజలు

పెనుమూరు, అక్టోబరు31 (సంక్షేమ సాక్షి ప్రతినిధి):- ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం పార్టీ పెనుమూరు మండల జడ్పీటీసీ అభ్యర్థి కార్జాలఅరుణకు ప్రజలు



బ్రహ్మరథం పడుతు న్నారు. శనివారం పులిక ల్లు ఎంపీటీసీ అభ్యర్థి మక్కినసంధ్య తో కలసి జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రజలు జడ్పీటీసీ అభ్యర్థి అరుణకు యాక్సి డెంట్ జరిగి, కాళ్ళకు దెబ్బ తగిలినా కూడా, కాళ్ళకు కట్టు కట్టుకుని, వాకర్ సహాయంతో మండలంలో ప్రతి సెగ్మెంటులోని గ్రామాలలో హుషారుగా ప్రచార కార్యక్రమాలలో పాల్గొంటూ, ప్రజలు మన్ననలు పొందుతున్నారు. దీంతో ఆమె ఏ గ్రామంలోకి వెళ్ళినా ప్రజలు కర్పూర హారతులిస్తూ, ఘనస్వాగతం పలుకుతున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డక్కిలిలో హోరాహోరీగా టీడీపీ అభ్యర్థి
రాజేశ్వరి ఎన్నికల ప్రచారం.

డక్కిలి, అక్టోబర్ 31 (సంక్షేమ సాక్షి ప్రతినిధి): స్థానిక మండలంలో ఎన్నికల సమరం రసవత్తరంగా మారుతోంది. డక్కిలి ఎంపీటీసీ సెగ్మెంట్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని రాజేశ్వరి



తన ఎన్నికల ప్రచారాన్ని వ్యూహా త్మకంగా, ముమ్మరంగా ముం దుకు తీసుకెళ్తున్నారు. శనివారం ఆమె నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో పర్యటించి, ఓటర్లను ఆకట్టుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలను సమ న్వయం చేసుకుంటూ, ఉత్సాహ భరిత వాతావరణంలో ఆమె జనంలోకి దూసుకెళ్తున్నారు. గ్రామాల్లోని ప్రతి ఇంటినీ సందర్శిస్తూ, ప్రజల ఆశీస్సులు కోరుతున్నారు. రాబోయే ఎన్నికల్లో తనకు మద్దతు పలికి, సైకిల్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆమె ఓటర్లను అభ్యర్థించారు. పార్టీ శ్రేణులన్నీ ఏకతాటిపైకి వచ్చి, సమష్టి కృషితో ప్రచార బరిలో దూసుకుపోతుండటంతో డక్కిలి సెగ్మెంట్‌లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. విజయమే ఏకైక లక్ష్యంగా అభ్యర్థి రాజేశ్వరితో పాటు పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు ప్రజాక్షేత్రంలో పర్యటిస్తూ ప్రచార హోరును మరింత ఉధృతం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని అభ్యర్థికి ఘనస్వాగతం పలికారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో
నవంబర్ 4, 5 తేదీలలో స్థానిక సెలవు ప్రకటన

తిరుపతి, అక్టోబర్ 31: (సంక్షేమ సాక్షి ప్రతినిధి): తిరుపతి జిల్లాలో 2026 సంవత్సరానికి సంబంధించి నిర్వహించనున్న రెండవ సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా



కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. ఎస్. వెంకటేశ్వర్, ఐ.ఏ.ఎస్. గారు స్థానిక సెలవులను ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, ఎన్నికల పోలింగ్ నిర్వహణకు వినియోగించే అన్ని ప్రభుత్వ భవనాలు, విద్యా సంస్థల భవనాలు మరియు ఇతర భవనాలకు 2026 నవంబర్ 4వ తేదీన (బుధవారం) మరియు పోలింగ్ జరిగే 2026 నవంబర్ 5వ తేదీన (గురువారం) స్థానిక సెలవు ప్రకటించారు. అదేవిధంగా, పోలింగ్ జరిగే ప్రాంతాలలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు మరియు ఇతర ప్రభుత్వ సంస్థలకు 2026 నవంబర్ 5వ తేదీన (గురువారం) స్థానిక సెలవు ప్రకటించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు, సంబంధిత అధికారులు ఈ ఉత్తర్వులను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశించారు.

మాజీ సర్పంచ్ సహా 35 కుటుంబాలు...
టీడీపీ నుండి వైసీపీలో చేరిక

పెనుమూరు, అక్టోబరు31 (సంక్షేమ సాక్షి ప్రతినిధి):- మండలంలోని కలికిరి పంచాయతి, మొరవకండిగ హరిజనవాడకు చెందిన మాజీ సర్పంచ్ కలికిరినాగరాజుతో పాటు 35 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ నుండి శనివారం వైసీపీ లో చేరారు. వీరందరికీ వైఎస్ఆర్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మహాసముద్రం దయాసాగర్ రెడ్డి చేతులమీదుగా వైసీపీ కండువాలు మెడలో వేసి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీసర్పంచ్ నాగరాజు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో మేమందరం అనేక రకాలుగా లబ్ధిపొందామని, ఇప్పుడు వైఎస్ఆర్ పార్టీని బలోపేతం చేయాలనే మేము వైసీపీలో చేరామని చెప్పారు. పార్టీలో చేరిన వారు కలికిరి మోహన్, సురేష్ కుమార్, రుద్రయ్య, సతీష్, విజయ్ కుమార్, వేణుగోపాల్, మమత, మీనా,



జమున, దొరస్వామి, భూలోకయ్య, సౌందర్య, మోహన్, చందన, కన్నయ్య, జయరామయ్య, ధనశేఖర్, మురళి, మహిత, హరీష్, దీప, నాగమ్మ, కన్నమ్మ, కె.అమరావతి, బి.అమరావతి లక్ష్మీకాంత, కావేరి, రామయ్య రాజేశ్వరి, చిట్టెమ్మ, ఉదయ, దివ్య, వినాయక, అంజలి, ప్రవీణ్, లోకేష్ తదితర 35 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ నుండి వైసీపీ లోకి జాయిన్ అయ్యారు. అనంతరం వైసీపీ కలికిరి ఎంపీటీసీ అభ్యర్థి జ్యోతి, పెనుమూరు మండల జడ్పీటీసీ అభ్యర్థి నిరీషాగిరిధర్ రెడ్డి లు మరింత ఉత్సాహంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మహేష్, మురళి, జగన్నాథం, రమేష్, సురేష్, పళణి, గోవిందయ్య తదితరులు పాల్గొనగా భారీసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దౌలతాపురంలో ఉనేబాదు జ్యోతి
విస్తృత ప్రచారం..!

ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని అభ్యర్థన

చిప్పగిరి అక్టోబర్ 31 (సంక్షేమ సాక్షి ప్రతినిధి): మండలంలోనీ దౌలతాపురం గ్రామంలో జడ్పీటీసీ అభ్యర్థిని ఉనేబాదు జ్యోతి విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.





వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో, ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి సహకారం, నాయకుల మద్దతుతో ఎన్నికల ప్రచారంలో ముందుకు సాగుతున్న ఆమెకు గ్రామ ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది. ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించిన సేవలను గుర్తుచేస్తూ మరోసారి ప్రజాసేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు.ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి నాయకత్వం, వైఎస్ జగన్ ఆశీస్సులు, పార్టీ శ్రేణుల ఐక్యతతో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నారు.ఈ ప్రచార కార్యక్రమం మండల కన్వీనర్ ఉనేబాదు మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించగా, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం ఉపాధ్యక్షులు బెల్దోన ఓబులేసు, దౌలతాపురం మాజీ సర్పంచ్ శేఖన్న, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దామోదర, పెద్ద శేఖన్న, చావాలా గోవిందు, సుధ, బంగారప్ప, శీన, చంటి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

బీఎస్పీలో కొత్త నాయకత్వం..

కమాల్ బాషాకు కీలక బాధ్యతలు!

ప్రొద్దుటూరు అక్టోబర్ 31 (సంక్షేమ సాక్షి ప్రతినిధి): బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ప్రొద్దుటూరు నియోజకవర్గంలో నూతన రాజకీయ కార్యవర్గం కొలువుదీరింది. పార్టీని



క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం తో పాటు, కార్యకర్తలకు కొత్త బాధ్యతలు అప్పగించే దిశగా పాత కమిటీని రద్దు చేసి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఆంధ్రకేసరి రోడ్డులోని బీఎస్పీ పార్టీ కార్యాలయంలో కడప జిల్లా అధ్యక్షుడు సగిలి గుర్రప్ప, పార్లమెంట్ ఇన్‌చార్జి డీఎస్ జయరామ్, జిల్లా కార్యదర్శి, ప్రొద్దుటూరు ఇన్‌చార్జి తీట్ల రవికుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీ నియామక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు నియోజకవర్గ నూతన అధ్యక్షుడిగా తాళ్లమాపురం కమాల్ బాషాను, ఉపాధ్యక్షురాలిగా షేక్ షబానాను నియమించారు. నూతన నాయకత్వంపై పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేశాయి. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు బహుజనుల హక్కులు, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల సమస్యలపై మరింత చురుగ్గా పనిచేయాలని పార్టీ నాయకులు సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులకు జిల్లా, పార్లమెంట్ స్థాయి నేతలు శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలో బీఎస్పీకి మరింత ప్రజాదరణ తీసుకురావాలని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా నాయకులు బేబీ, మేరీ, మైదుకూరు అధ్యక్షుడు భాస్కర్, ప్రొద్దుటూరు ఇన్‌చార్జి తీట్ల రవికుమార్‌తో పాటు పలువురు బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుమ్మలలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా..
భారీ బైక్ ర్యాలీ

జమాల్ ఖాన్ ఆధ్వర్యంలో జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణుల ఎన్నికల ప్రచారం

చింతూరు అక్టోబర్ 31 (సంక్షేమ సాక్షి ప్రతినిధి): మండలంలోని తుమ్మల ఎంపీటీసీ పరిధిలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగుతోంది. ఇందులో భాగంగా కుమ్మూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు జమాల్



ఖాన్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా జమాల్ ఖాన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి అభ్యర్థులు ప్రజల్లోకి వెళ్తున్నారని తెలిపారు. జెడ్పీటీసీ అభ్యర్థి తీగల కవిత విజయానికి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు సమన్వయంతో పనిచేస్తూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.ఈ ర్యాలీలో మూడు పార్టీల మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యానికి భరోసా..!

జగ్గంపేట సీహెచ్‌సీలో చిన్నపిల్లల వైద్యుడు అందుబాటులో!

జగ్గంపేట అక్టోబర్ 31 (సంక్షేమ సాక్షి ప్రతినిధి): చిన్నపిల్లల ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులకు శుభవార్త. జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో చిన్నపిల్లల వైద్యుడు అందుబాటులో ఉన్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్



ప్రణీత్ తెలిపారు. చిన్నారులకు అవసరమైన వైద్య పరీక్షలు, ఆరోగ్య సమస్యలకు సంబంధించి వైద్యుల సేవలను ఆసుపత్రిలో పొందవచ్చని వెల్లడించారు.జగ్గంపేట తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చిన్నపిల్లల వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే వైద్య సేవలు పొందే అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, అవసరమైనప్పుడు వైద్యులను సంప్రదించాలని కోరారు. జగ్గంపేట పరిసర ప్రాంతాల ప్రజలందరూ ఈ వైద్య సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ప్రణీత్ విజ్ఞప్తి చేశారు.

అర్బన్ స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు 780 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు 5 వేల మంది సిబ్బంది నియామకం

జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

సంక్షేమ సాక్షి కర్నూలు : అర్బన్ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. శనివారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ లో భాగంగా గూడూరు మండల కేంద్రంలో క్రీడా ప్రాంగణం ఇండోర్ భవనం లో, నగర శివారులోని అథెనా పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ కేంద్రం, ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ ను జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ కర్నూలు నగరపాలక సంస్థ, ఎమ్మిగ నూరు మున్సిపాలిటీ, ఆదోని మున్సిపాలిటీ, గూడూరు నగర పంచాయతీ పరిధిలోని నాలుగు పట్టణ స్థానిక సంస్థల పరిధిలో మొత్తం 780 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఎన్నికల విధుల నిర్వహణకు సుమారు 5 వేల మంది సిబ్బందిని నియమించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.. పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వార్డుల వారీగా, పోలింగ్ కేంద్రాల సంఖ్యకు అనుగుణంగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన టేబుల్ వద్ద ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తూ, తమకు కేటాయించిన స్టాట్యుటరీ, నాన్‌స్టాట్యుటరీ ఎన్నికల సామగ్రిని జాగ్రత్తగా తనిఖీ చేసుకుని స్వీకరించేలా ఏర్పాట్లు చేశామన్నారు.. సిబ్బం దికి నాణ్యమైన ఆహారం అందించేందుకు ఫుడ్ కోర్టులు ఏర్పా టు చేయడంతో పాటు, తాగునీరు, మరుగుదొడ్ల సదుపా యాలు కల్పించడం జరిగిందన్నారు. మరుగుదొడ్ల పరిశుభ్రత కోసం ప్రత్యేక పారిశుధ్య సిబ్బందిని షిఫ్టుల వారీగా నియమించడం జరిగిందన్నారు. పోలింగ్ సామగ్రి, సిబ్బంది రవాణా కోసం ముందుగానే వాహనాలను ఏర్పాటు చేయడం





జరిగిందన్నారు. సిబ్బంది నేడు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని రాత్రి అక్కడే బస చేసి, మరుసటి రోజు ఉదయం పోలింగ్ విధులకు సిద్ధంగా ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. పోలింగ్ సిబ్బందికి ఇప్పటికే రెండుసార్లు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. బ్యాలెట్ బాక్సుల నిర్వహణ, ప్రిసైడింగ్ అధికారి విధులు, అధికారాలు, పరిమితులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది బాధ్యతలు, ఓటర్ల జాబితాల వినియోగం, పోలింగ్ ఏజెంట్లకు కేటాయించాల్సిన స్థానం తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పోలింగ్ ఏజెంట్లు, ఎన్నికల సిబ్బంది కూర్చునే ప్రదేశాలను సూచించేలా సైన్‌బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఓటు రహస్యతను కాపాడేలా ఓటింగ్ కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేసేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. సున్నిత, అత్యంత సున్నిత పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. 105 లొకేషన్ల పరిధిలోని 450 పోలింగ్ కేంద్రాల్లో ఓటు రహస్యతకు ఎలాంటి భంగం కలగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల లోపల, బయట నిఘా ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. అవసరమైన చోట్ల మైక్రో అబ్జర్వర్లు, వీడియోగ్రాఫర్లను నియమించడంతో పాటు, పోలీసు బందోబస్తును కూడా పటిష్టం చేశామన్నారు. పోలింగ్ సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు చేర్చేందుకు రూట్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం సిబ్బందిని ఎన్నికల సామగ్రితో సహా రిసెప్షన్ కేంద్రానికి తీసుకువచ్చేలా రవాణా ఏర్పాట్లు చేశామని, అవసరమైన హమాలీలు, సిబ్బంది సహకారంతో స్ట్రాంగ్ రూములకు తరలించేలా చర్యలు చేపట్టడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, గూడూరు నగర పంచాయతీ మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రియం వద, తదితరులు పాల్గొన్నారు.

పంచలింగాల చెక్‌పోస్టు వద్ద...
ముమ్మరంగా వాహన తనిఖీలు

48 రాయల్ స్టాగ్ విస్కీ బాటిళ్లు స్వాధీనం

సంక్షేమ సాక్షి కర్నూలు : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు కర్నూలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా కర్నూలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పంచలిం గాల చెక్‌పోస్టు వద్ద వా హనాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ఈ తనిఖీల్లో భాగంగా ఎం. అజయ్ కుమార్ అనే వ్యక్తి వద్ద అక్రమంగా తరలిస్తున్న 48 రాయల్ స్టాగ్ విస్కీ బాటిళ్లను (180 ఎం.ఎల్. చొప్పున) అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె. చంద్రహాస్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి అక్రమంగా మద్యం రవాణా జరగకుండా చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అక్రమ మద్యం రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె. చంద్రహాస్, ఎస్ఐ నవీన్, పంచలింగాల ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వరరావు, శిక్షణలో ఉన్న సబ్‌ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఎస్ఎస్‌టీ బృందం సభ్యుడు భక్తవత్సలం తదితర సిబ్బంది పాల్గొన్నారు.



దేశ సమగ్రతకు పటేల్ చేసిన సేవలు
చిరస్మరణీయం

అఖండ భారత నిర్మాణంలో ఉక్కు మనిషి పాత్ర మరువలేనిది

పటేల్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం: మేయర్ మూడ్ గణేష్

భద్రాద్రి కొత్తగూడెం అక్టోబర్ 31 (సంక్షేమ సాక్షి ప్రతినిధి): దేశ ఐక్యత, సమగ్రత పరిరక్షణ కోసం జీవితాంతం కృషి చేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు ప్రతి ఒక్కరికీ



ఆదర్శమని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. పటేల్ జయంతిని పురస్కరించుకుని శనివారం కొత్తగూడెం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం అనంతరం దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న సంస్థానాలను ఏకం చేసి అఖండ భారత నిర్మాణానికి పటేల్ చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. దేశ సమైక్యత కోసం ఆయన ప్రదర్శించిన ధైర్యసాహసాలు, దూరదృష్టి, అంకితభావం నేటి తరానికి మార్గదర్శకమని తెలిపారు.పటేల్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని జాతీయ సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన సేవలు, త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ సుజాత, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో...
అన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చాలి

ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి







సంక్షేమ సాక్షి నంద్యాల :

నంద్యాల పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, ఓటర్లు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నంద్యాల పట్టణంలోని నడిగడ్డ 6వ వార్డు, సరస్వతీ నగర్ 15వ వార్డు, బొగ్గులైన్ 27వ వార్డు ప్రైమరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం, ర్యాంపులు, ఇతర అవసరమైన ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని, పోలింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

సంక్షేమ సాక్షి
తెలుగు దిన పత్రిక

వైభవంగా స్వర్ణరథోత్సవం

సంక్షేమ సాక్షి శ్రీశైలం : ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది. కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా ఈ రోజు







వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది. ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, అతివృష్టి అనావృష్టి నివారించబడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు లోకకల్యాణానికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. అనంతరం భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, తప్పెట చిందులు, మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కార్యక్రమములో పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

దేవస్థానము వైద్యశాలకు...

ఎ.బి.జి ఎనలైజర్ పరికరం అందజేత

సంక్షేమ సాక్షి శ్రీశైలం : దేవస్థానం వైద్యశాలకు హైదరాబాద్‌కు చెందిన దాత సరోజినీ అగర్వాల్ రూ. 4,31,004/- విలువ చేసే అత్యాధునిక వైద్య పరికరాలను విరాళంగా



అందజేశారు. ఈ విరాళంలో భాగంగా సీమెన్స్ కంపెనీకి చెందిన ABG ఎనలైజర్ (EPOC NXS HOST & READER) తో పాటు 3 కార్ట్రిడ్జ్ లను దేవస్థానం వైద్యశాల అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యశాల డాక్టర్లు మాట్లాడుతూ రక్తంలోని ఆక్సిజన్ స్థాయిలను, రక్తంలోని ఆమ్ల-క్షార సమతుల్యతను, శ్వాసకోశ తదితర సమస్యలకు సంబంధించిన వాటికి ఎ.బి.జి. అనలైజర్ (Arterial Blood Gas Analyser) అనే పరికరం ఎంతో మేలు చేస్తుందని వైద్యులు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగుల రక్త పరీక్షలు (Blood Gas Analysis) తక్షణమే చేసి, వేగంగా వైద్య సేవలు అందించేందుకు ఈ పరికరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ శ్రీస్వామిఅమ్మవార్ల ఆశీస్సులతో వైద్యశాలకు విరాళాన్ని యిచ్చే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాని అన్నారు. దేవస్థానం అధికారులు దాతకు శేషవస్త్రాలు, శ్రీ స్వామిఅమ్మవార్ల ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమములో పర్యవేక్షకులు బి. శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ కె. శ్రీనివాసప్రసాదు, దేవస్థాన వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న అపోలో డాక్టర్లు, దేవస్థానం వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి...

విశేష అభిషేకం

సంక్షేమ సాక్షి శ్రీశైలం : లోకకల్యాణం కోసం షష్ఠిని పురస్కరించుకుని దేవస్థానం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను



నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించ బడుతున్నాయి. కుమారస్వామి వారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్య స్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతుల తో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు,పెరుగు,తేనె,నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.

మునిసిపల్ ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు

నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి

ఎన్నికల బందోబస్తు సిబ్బందికి దిశానిర్దేశం చేసిన ...కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి

సంక్షేమ సాక్షి కర్నూలు : కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ ప్రశాంతంగా , స్వేచ్ఛగా , నిష్పక్షపాతంగా జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. ఈ సందర్భంగా శనివారం గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలోని అథీనా స్కూల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఎన్నికల బందోబస్తు విధులకు హాజరైన పోలీసు అధికారులు, సాయుధ బలగాలు, సిబ్బందికి ఎన్నికల విధుల పై దిశానిర్దేశం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధిలో ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత కొనసాగించాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఉంచుతూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. సున్నిత, అత్యంత సున్నిత పోలింగ్



కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలన్నారు. కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో రాత్రి బస చేసి, ఉదయం నుంచి అప్రమత్తంగా ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల లోపల, బయట ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన చోట్ల వీడియోగ్రాఫర్లను నియమించి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తూ ప్రతి ఒక్కరూ నిష్పక్షపాతంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించు కునేలా సమన్వయంతో విధులు నిర్వర్తించాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ హనుమంతు , అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, డిఎస్పీలు రాఘవేంద్ర, దుర్గ ప్రసాద్ , సీఐలు, ఎస్సైలు, సాయుధ బలగాలు, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఇందిరమ్మ

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బోయ క్రాంతి నాయుడు

సంక్షేమ సాక్షి కర్నూలు : ఇందిరా గాంధీ నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపారని భారత తొలి మహిళా ప్రధాన





మంత్రి, ప్రపంచ ఉక్కుమహిళగా పేరుగాంచిన భారతరత్న ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు దేశంలో ప్రతి ఇల్లూ ఆనందంగా ఉండేదని నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిందని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు న్యాయవాది బోయ క్రాంతి నాయుడు ఆమె సేవలను కొనియాడారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ఇందిరా గాంధీ 42 వ వర్ధంతి మరియు భారత తొలి ఉప ప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 151 వ జయంతి సందర్భంగా వారి చిత్ర పటములకు పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం క్రాంతి నాయుడు మాట్లాడుతూ ఇందిరా గాంధీ పాలనలో దేశంలో ప్రజలు ఎంతో సుఖ సంతోషాలతో జీవించారని ఆమె గరీబీ హటావో, బ్యాంకుల జాతీయకరణ, రాజ భరణాల రద్దు, అంటరానితన నిర్మూలన మొదలగు ఎన్నో సాహసోపేత నిర్ణయాలను అమలు పరిచి దేశ ప్రజలను కంటికి రెప్పలా కాపాడిందని ఎన్నో జాతీయ సంస్థలు స్థాపించిందని, నేడు మోడీ పడుతున్నారని దేశంలో హత్యలు, అత్యాచారాల నియంత్రణలో మోడీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని నాడు ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు ఎన్నో ప్రభుత్వ రంగ సంస్థలను స్థాపించిందని, నేడు ప్రధాని మోదీగారు ప్రభుత్వరంగ సంస్థలను అంబానీ, అదానీలకు ప్రైవేట్ పరం చేసి పేదల జీవితాల్లో చీకట్లు నింపుతున్నాడని విమర్శించారు. అలాగే భారత మొదటి ఉపప్రధాని, మొదటి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్య సమరయోధుడుగా, 1931 సంవత్సరంలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహా సభకు అధ్యక్షత వహించారని, సాహసోపేత నిర్ణయాలతో ఐదువందలకు పైగా స్వదేశీ సంస్థానాలను విలీనం చేసి స్వతంత్ర భారతావనిని ఏకం చేసిన ధీశాలి సర్దార్ వల్లభాయి పటేల్ ఆయన పుట్టిన రోజును లిజాతీయ ఐక్యతాదినంలి గా జరుపుకుంటున్నామని క్రాంతి నాయుడు తెలియ జేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు మాట్లాడుతూ ఇందిరా గాంధీ పాలన స్వర్ణ యుగంగా ఇచ్చిన ఘనత ఇందిరా గాంధీ దేనని ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర బాబు, కాంగ్రెస్ మేయర్ అభ్యర్థి డాక్టర్ కే తామర వేణి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఉండవెల్లి వెంకటన్న, ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్సి బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షులు డివి సాంబశివుడు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీసాల సుమలత, ఓబీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐఎన్టియుసి రాష్ట్ర కార్యదర్శి ఎం సుంకన్న, కాంగ్రెస్ నాయకులు పోతుల శేఖర్, షేక్ రియాజుద్దీన్, బి సుబ్రహ్మణ్యం, జాన్ సదానందం, అలెన్ కుమార్, పాట్రిక్ డేవిడ్, ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, ఎస్సీ సెల్ డబ్ల్యూ సత్యరాజు, కార్పొరేటర్ అభ్యర్థులు ఆకేపోగు రంజిత్ కుమార్, డివి చంద్ర, సరస్వతి అబ్దుల్ హై, వసీం, దూద్ పిరా, లోకనాథం, హనుమంతు మొదలగువారు పాల్గొన్నారు.

డీపీఆర్వో శ్యామ్ కుమార్ ఉద్యోగ విరమణ

జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో ఘన వీడ్కోలు

సంక్షేమ సాక్షి నెల్లూరు : సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐ అండ్ పీఆర్)లో 33 సంవత్సరాల పాటు అంకితభావంతో విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్వో) జొన్నకూటి శ్యామ్ కుమార్‌కు నెల్లూరులో ఘనంగా వీడ్కోలు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఎంప్యానల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఏపీఈఎన్ పీఏ) నాయకులు వల్లూరు ప్రసాద్ కుమార్, ఉడతా రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం (ఏపీజేఎఫ్) జిల్లా అధ్యక్షులు శాఖమూరి శ్రీనివాసులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "శ్యామ్ కుమార్ గారు సమాచార శాఖలో ఎన్నో ఏళ్లుగా విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య సమర్థవంతమైన వారధిగా నిలిచి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు. అంతేకాకుండా జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో



ఎల్లప్పుడూ ముందుంటూ, మీడియా ప్రతినిధులతో నిరంతరం స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించారు. సిబ్బంది స్థాయి నుంచి క్రమశిక్షణతో డీపీఆర్వో స్థాయికి ఎదిగిన ఆయన ప్రస్థానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. తన బాధ్యతలను విజయవంతంగా పూర్తి చేసుకుని పదవీ విరమణ చేస్తున్న ఆయన విశ్రాంత జీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో సాగాలి" అని మనసారా ఆకాంక్షించారు. అనంతరం శ్యామ్ కుమార్ ని శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

Printed, Edited, Published and Owned by KURUVA SRINUVASULU, Printed at Uttejitha Publications# 48-80 1 U2, Budhwarapet, A.camp, Kurnool-518002, A.P.,
Publeshed from H.No. 91/4-31-3-1B BAAJI NAGAR Kurnool-518006, AP, RNI APTEL/2022/82637,Cell: 9951813334, e-mail : sankshemasaakshi@mail.com